ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

సెప్టెంబర్ 17, 2006



చదివే ఆసక్తి తగ్గిందా ?

హ్యాపీ బర్త్‌డే

(17.9.2006 నుంచి 23.9.2006వరకు)

ఎస్. ప్రేమ్‌కుమార్
2సం॥, సెప్టెంబర్-17
జ్యోతి-రవికిరణ్
కృష్ణలంక-విజయవాడ

ఆర్.వినయ్‌కుమార్
2సం॥, సెప్టెంబర్-17
భాగ్యలక్ష్మి-రాజా
గొల్లపాడు-ఖమ్మం



తైసిమ్
1సం॥, సెప్టెంబర్-17
షబానా-ఇమాం పాషా
శంకర్‌పల్లి-రంగారెడ్డి

బి. శ్రీకన్య
సెప్టెంబర్-17
చంద్రకళ-శ్రీశైలం
శంకర్‌పల్లి-రంగారెడ్డి

సిహెచ్. ప్రభాత్
8సం॥, సెప్టెంబర్-17
సునంద-బాబూరావు
విజయవాడ-కృష్ణ

దానిష్ రెయ్యాన్
సెప్టెంబర్-17
సాజిదా-షాజహాన్
బిహెచ్ఈఎల్-హైదరాబాద్



కె. నవీన్
1సం॥, సెప్టెంబర్-18
విజయలక్ష్మి-గురు ప్రసాద్
కన్నెగుండ్ల-గుంటూరు

చినతల్లి
1సం॥, సెప్టెంబర్-18
నాగమణి-అబ్బులు
బలుసులపేట-తూ॥గో॥

సిహెచ్. దినేష్
7సం॥, సెప్టెంబర్-22
సునీత-గోపి
అంతర్వేది-తూ॥గో॥

కె. అనూష
రమాదేవి-శ్రీనివాసరావు
కామేపల్లి-ఖమ్మం

వి. కళ్యాణి
సెప్టెంబర్-17
గీత-మునిస్వామి
గొందిపర్ల-కర్నూలు

టి. రిషి
2సం॥, సెప్టెంబర్-2004
అనిత-రాజు
బాబానగర్-రంగారెడ్డి

టి. లావణ్య
4సం॥, సెప్టెంబర్-2002
అనిత-రాజు
బాబానగర్-రంగారెడ్డి

ప్రేమ్ సాగర్
2సం॥, సెప్టెంబర్-2004
గీత-రంగస్వామి
హల్వి-కర్నూలు

పవన్ కుమార్
4సం॥, సెప్టెంబర్-2002
గీత-రంగస్వామి
హల్వి-కర్నూలు

కె. ప్రవల్లిక
8సం॥, సెప్టెంబర్-1998
శోభారాణి-నాగేశ్వరరావు
ములకలపల్లి-ఖమ్మం

పి. హేమసాయిదేవి
3సం॥, సెప్టెంబర్-21
సత్యవాణి-నారాయణరాజు
ఏలూరు-ప॥గో॥



ఇతరులపై ఆధారపడకూడదు

మన అతిథి గురించి...

పేరు	:	జయసింహ
జన్మదినం	:	**5 జనవరి 1965**
జన్మస్థలం	:	కట్టంగూర్, నల్గొండ జిల్లా
విద్య	:	ఎంబిఎ, ఎంఎస్‌సి, ఎంఎస్, ఎఎంఐఇ, బిఇడి డిగ్రీలతోపాటు ఎన్నో పిజి డిప్లొమాలు.
వృత్తి	:	వ్యక్తిత్వ వికాస శిక్షణా నిపుణులు
బిరుదులు, అవార్డులు	:	డేల్ కార్నేగీ ఆఫ్ ఇండియా, మెమొరీ మాయెస్ట్రో, గిన్నీస్ రికార్డ్ సృష్టికర్త, మాస్టర్ ట్రైనర్
ఆదర్శం	:	స్వామి వివేకానంద, చంద్రబాబు నాయుడు
నచ్చిన పుస్తకం	:	హౌ టు విన్ ఫ్రెండ్స్ అండ్ ఇన్‌ఫ్లూయెన్స్ పీపుల్
నచ్చని అంశం	:	మనుషులు తమలో ఉన్న శక్తిని, టాలెంట్‌ను ఉపయోగించుకోకుండా మామూలుగా, ఉదాసీనంగా బతికేయడం
లక్ష్యం	:	ప్రపంచంలోనే ఉత్తమ మోటివేషన్ స్పీకర్‌గా ఎదగడం
బలం	:	మానవ సంబంధాలు, పట్టుదల, కష్టపడే మనస్తత్వం.
బలహీనత	:	అవసరాన్ని మించి జాలి, కరుణ, ఎదుటివాళ్ల కష్టాలను చూడలేకపోవడం.

సమాజంలో విలువలు పతనమవుతున్నాయనే చెప్పాలి. మనుషుల్లో స్వార్థం పెరిగింది. పాశ్చాత్య సంస్కృతిపై మోజు చూపుతూ మన సంస్కృతి, ఆచార వ్యవహారాలకు తిలోదకాలిస్తున్నారు. దీంతో పెద్దలపై గౌరవ మర్యాదలు చూపడంలేదు. కనీస విలువలు మరచిపోతున్నారు. ఏది చేసినా సరిపోతుందిలే అనే మనస్తత్వం అలవడుతోంది. దీంతో మన సంస్కృతి, సంప్రదాయాలకు గుర్తింపు పోతోంది. మన అస్తిత్వానికి సార్థకతను చేకూర్చే ఈ లక్షణాలు లేనప్పుడు మనకు గుర్తింపే ఉండదు. చరిత్రహీనులుగా మిగిలిపోతాం. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని కాకుండా యువత కష్టపడే తత్వం, ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం పెంచుకోవాలి. ఇతరులపై ఆధారపడకూడదు. మానవతా విలువలతో ముందుకు సాగాలి.

ఈ సంచికలో...

టపా	...	2
ఓ మంచి పుస్తకం	...	4
సలహాలు	...	5
ఇంటి సంగతులు	...	6
క్యాంపస్ ఛాట్	...	10
సినిమా కబుర్లు	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
సెన్సూ కామన్ సెన్సు	...	20

ఇంకా...

ఇలా వుందామా... 7

మనస్సాక్షి

సీరియల్ 8

తెలుగుగడ్డ

కథ 18

క్షవరం

అవీ... ఇవీ...	...	21
మనసా... తెలుసా	...	22
విజ్ఞాన వీచిక	...	23
కొత్త పుస్తకాలు	...	24



అట్టమీది కథ

సెప్టెంబర్ 3, 2006 న స్నేహ సంచికలో ప్రచురించిన అట్టమీది కథ బాగుంది. చాలా విషయాలు తెలుసుకునేందుకు ఉపయోగపడింది. రెండు సూర్యోదయాల నడుమ ప్రపంచవ్యాప్తంగా 30వేల మంది పసిపిల్లలు నిశ్శబ్దంగా చనిపోయారంటే మీరునమ్మగలరా? అంటూ సాగిన శైలి మమ్మల్ని విస్మయపరిచింది. కొద్దిసేపు మేమేం చదివాం అన్న విషయాన్ని నమ్మలేకపోయాం. ఆహారలేమి వల్ల చనిపోయే వారి సంఖ్య మమ్మల్ని అబ్బురపర్చింది.

నివేదిత, చరణ్, శ్రీకాళహస్తి



అతిథి

అసలు సిసలైన కూచిపూడి శర్మ సందేశం క్లుప్తంగా, కమనీయంగా ఉంది. కార్టూన్ లక్ష్మణ్ జీవిత మలుపు సంఘటన బాగుంది. కండబలానికి తిండి కావాలంటూ తిండి అవసరం గురించి వివరించిన కీలకాంశాలు బాగున్నాయి. బాలనేస్తాల బొమ్మలు బాగుంటున్నాయి. నవ్వే కుక్క నాణ్యంగా ఉంది. బడి కథ నీతిని తెలియజేసింది.

వాస్తు రామచంద్ర,
రామ్‌జీనగర్, నెల్లూరు.

ఆశ్చర్యపోయాం

'టర్నింగ్ పాయింట్'లో ఆర్‌కె లక్ష్మణ్ గురించి తెలుసుకున్నాం. కాకులను గమనించడం, వాటిని చిత్రించడం అతని హాబీ అని చదివి ఆశ్చర్యపోయాం. హ్యాపీ బర్త్‌డే మేకప్ బాగుంది. కార్టూన్లు హాయిగా వున్నాయ్. కథ బాగుంది. న్యాయసలహాలు ఉపయోగకరంగా ఉంటున్నాయి.

వి. వనజ, గాంధీనగర్,
హైదరాబాద్.

ధన్యవాదాలు

ప్రతివారమూ మీరందించే 'స్నేహ' అంటే మాకు చాలా ఇష్టం. మొదటి పేజీలో 'అతిథి' శీర్షికలో మంచి వ్యక్తుల గురించి ఇస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. 'టీ(బ్రేక్'లో ఇచ్చిన జోక్స్ బాగున్నాయి. 'రుచి'లోని వంటకాలు బాగున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే స్నేహలోని అన్ని శీర్షికలూ బాగున్నాయి.

సంతోష్ నాయక్,
జి ఏసురత్నం, తిరుమలగిరి,
నల్లగొండ

వినోదదాయకంగా

బాలలకథ 'బడి' నీతిదాయకంగా ఉంది. 'బాలనేస్తాలు' పిల్లలకు విజ్ఞాన, వినోద దాయకంగా ఉంటోంది. మంచి శీర్షికలతో ఓ వార పత్రిక చదువుతున్న అనుభూతినిస్తోంది 'స్నేహ'

నిశాంత్‌రాయ్, చిట్యాల

తిండికలిగితే...

కవర్‌స్టోరీ ఎంతో ఉపయోగకరంగా ఉంది. పోషకాహారపు విలువల ప్రాధాన్యత ఎలాంటిదో గ్రహించాం. అందించిన విషయాలన్నీ ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి. కొత్త పుస్తకాలు శీర్షిక ద్వారా వెలువడుతున్న తాజా పుస్తక సమాచారం తెలుస్తోంది.

నేమాన సుభాష్ చంద్రబోస్,
శ్రీకాకుళం.

కనువిప్పు

'ఇలా ఉందామా' శీర్షికలో ప్రచురించిన 'ఆకలి' కథనం చాలా బాగుంది. సోషలిజానికి నిర్వచనం ఇచ్చారు. నిజంగా సోషలిజమే వస్తే ఎంత బాగుంటుందో అర్థమయ్యేట్లుగా రచయిత చాలా చక్కగా వివరించారు. అభినందనలు. 'సినిమాకబుర్లు' శీర్షికలో కోట శ్రీనివాసరావుగారు వ్యక్తిగా ఎలా రాణించారో తెలియజేశారు. గుమ్మడికాయంత టాలెంట్ ఉంటే సరిపోదు ఆవగింజంత అదృష్టమూ ఉండాలన్న సామెత ఆయనకే చెల్లింది. వారి అనుభవాలకు హేట్సాఫ్. తెలకపల్లి రవిగారు రాసిన 'భవనం' కథ స్ఫూర్తినిచ్చింది. సదా నిరాశానిస్పృహలతో ఉన్నవ్యక్తి సోమరితనాన్ని ముసలాయన భవనంతో పోల్చి చెప్పడం బాగుంది. ఇటువంటి వ్యక్తులకు కనువిప్పు కలిగేలా కలిగేలా చాలా చక్కగా వుందీ కథ.

చిప్పాడ ఉమామహేశ్వరరావు,
కురుపాం, విజయనగరం

అనుభవసారం

'సెన్సూ కామన్ సెన్సు' శీర్షికలోని 'అనుభవసారం'లో చెప్పిన విధంగా చాలామంది వృద్ధులు ప్రవర్తిస్తారు. మరికొందరైతే తమ అనుభవాల్ని పదేపదే చెబుతూ ఉంటారు. ఎదుటివారికి వినాలన్న ఆసక్తి ఉందో లేదో అన్న విషయాన్ని అస్సలు పట్టించుకోరు. ఆత్మకథల్లో అతిశయోక్తులు చేర్చితే ఎవరూ దాన్ని వినడానికీ అంగీకరించరన్న మాట వాస్తవం.

ఎన్. శ్రీవిద్య, కాకినాడ

బాగున్నాయి

స్నేహలోని అన్ని శీర్షికలు బాగుంటున్నాయి. పుస్తకం తెరవగానే ముందుగా కనిపించే 'హ్యాపీ బర్త్‌డే' శీర్షిక చూసి చిన్నారులు సంతోషపడుతున్నారు.

జె. శ్రీనివాస్, కొత్తగూడెం.

రూ.510/-ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/-కే



మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	రూ.
రూ.130/-	రూ.170/-	రూ.210/-	510/-

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు త్రాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

రూ. 150/-కే

ఇవన్నీ!

ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!...

నేను ఒకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. నా ప్రక్క సీటులోని వ్యక్తి స్టూడెంట్స్ ఇంగ్లీష్ ఇన్‌స్టిట్యూట్ వారి పుస్తకాలు చదువుతున్నాడు. నేనూ టైంపాస్ కొరకు ఒక బుక్ తీసుకొని చదివాను. అంతే! నాకు ఆశ్చర్యంవేసింది. "ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!..." అనిపించింది. నేనూ పుస్తకాలు తెప్పించుకుని చదివి ప్రస్తుతం నేను చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నాను.

- కె.కమలాకరరావు, విజయవాడ.

ఇదొక డిఫరెంట్ కోర్స్!

డిగ్రీవరకు చదివిన నేను ఇంగ్లీష్‌లో మాట్లాడలేకపోయేవాడిని. నా మిత్రుని వద్ద ఈకోర్స్ బుక్స్ చూశాను. ఇంగ్లీష్ ఫ్లూయెన్సీకి కరక్ట్‌గా ఉపయోగపడే బుక్స్ యివి. 'ఇదొక డిఫరెంట్ కోర్స్' అని నాకు అనిపించింది.

- వి.కె. రాజు, రాజమండ్రి.

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్థమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

- కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు, ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జె.శ్రీనివాసులు, తిరుపతి.

STUDENTS' ENGLISH INSTITUTE

POST BAG NO.8569, New No. 203, Habibullah Road, (Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

3840

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు కేవలం రూ.150/- లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

Name: ....

Address: ....

....

....

....

.... Pincode

ఓ మంచి పుస్తకం

వకుళాభరణం లలిత

మృత్యోర్మా అమృతంగమయ

'మృత్యోర్మా అమృతంగమయ' గ్రంథం శ్రీమతి హేమలతా లవణం జీవితం. తన జన్మభూమికోసం, సమాజంకోసం అహర్నిశలూ కష్టపడ్డారావిడ. నేరస్తజాతులుగా ముద్రపడినవారికీ, జోగినీలకూ ఆత్మవిశ్వాసాన్ని కలిగించి, గౌరవప్రదమైన జీవితంపట్ల ఆసక్తిని, ఆకాంక్షను రేకెత్తించిన వ్యక్తి హేమలతాలవణం. జోగినులలో సాంఘిక చైతన్యాన్ని కలిగించాలని ఆవిడ తపించారు. ఎవరికోసం ఆమె శ్రమిస్తున్నారో వాళ్లే ఉద్యమానికి అడ్డుతగిలారు. ఆ అమాయకత్వాన్ని గుర్తించి, వారినే ఈ దురాచార నిర్మూలనా రణరంగసైనికులుగా తయారుచేశారు. హేమలత సుదీర్ఘ జీవితంతోపాటు ఆమె సాగించిన సామాజిక కృషి ఈ గ్రంథంలో పొందుపరిచారు.

నేటి సమాజంలో మానవ సుఖజీవనానికి, ప్రశాంతతకూ ఎన్నో అవరోధాలు, కులమతకట్టుబాట్లు, ఆచార సాంప్రదాయాలు, యాంత్రిక నాగరికత లాంటివన్నీ మరికొన్ని ఆటంకాలు. ప్రధానంగా జోగినీ వ్యవస్థ స్త్రీని మరింత హీనపరిస్థితికి దిగజార్చింది. ఊరికి పట్టిన పీడను, సమాజాన్ని పట్టిపీడిస్తున్న అరిష్టాన్ని వదిలించాలని చెబుతూ, కొందరు స్వార్థపరులు జోగినీ ఆచారాన్ని ఏర్పర్చారు. ఈ ఆచారం ద్వారా అరిష్టాన్ని పోగొట్టి దేవతలను ప్రసన్నం చేసుకోవాలన్న మూఢనమ్మకం ప్రబలింది. దేవతను ప్రసన్నం చేయాలంటే ఆడపిల్లను జోగినీ, మాతమ్మ, బసివి, మరియమ్మ, మురళిలనే పేర్లతో దేవతకు అర్పించాలి. ఇది ఊరంతటికీ ఒకపెద్ద పండుగ. ఆరు సంవత్సరాల అమ్మాయిలను జోగిన్లుగా మారుస్తారు. వీరు ప్రధానంగా పేద, దళిత కుటుంబాలనుంచి వస్తారు.

ఎల్లమ్మ పాదాలతో చేసిన తోలుబిళ్లను పోతురాజు మంగళసూత్రంగా ఆడపిల్ల మెడలోకట్టాడు. దాంతో ఆమె శేషజీవితమంతా 'నిత్యసుమంగళి'గా చెలామణి అవుతుంది. ఇది మొదటి ఘట్టం. రెండోఘట్టం ఆ జోగిని జీవిత సుమాన్ని కాలరాచే దశ. మూఢాచారం పొరలు గప్పిన కళ్లతో, ఆడపిల్లను మతం పేరుతో దేవత పేరుతో ఆజన్మాంత వ్యభిచారిణిగా మార్చే రోజది. కాస్తోకూస్తో డబ్బాదస్కం, సీసాల నిండా కల్లు, నూతన వస్త్రాలు ఇవన్నీ కన్నెరికానికి ఎదుర్పులు. దీన్నే 'మైల పట్టం' దశ అంటారు.

షెడ్యూల్డ్ కులాలు, తెగలలో ఈ జోగినీల పద్ధతి ఏర్పడింది. శవాలముందు శవమై నాట్యంచేసే నికృష్టస్థితికి, పంటపొలాల్లో అడుక్కునే దీనావస్థకూ దిగజారింది. తిట్లతో, అవమానాలతో, అవహేళనలతో జీవిస్తూ, తనమీద ఆధారపడ్డ తల్లిదండ్రులకు జీవనాధారంగా జోగిని నిలవాలి. జోగినీలు దుర్భరజీవితాన్ని గడుపుతూ మరోవైపు అడ్రసు లేని వ్యక్తులకు బిడ్డల్ని కంటారు. వృద్ధాప్యంలో చూసేవారు కరువై, ఆకలితో, రకరకాల వ్యాధులతో కుంగి కృశించిపోతారు. ఈ సమస్య పరిష్కారానికి హేమలత చేసిన కృషి అనన్యసామాన్యం. జోగినీలు వ్యవసాయం చేసుకోవడానికి భూవసతిని చూపారావిడ. వాళ్ల పిల్లలు చదువుకోవడానికి బడులుపెట్టి వాళ్లకోసం నిజామాబాద్ జిల్లా వర్నీలో 'చెల్లినిలయాన్ని' ఏర్పరిచారు. వారికి పునరావాసం కల్పించారు.

హేమలత, భర్త శ్రీ లవణంతో కలిసి చేపట్టిన ఇంకో ముఖ్య సాంఘిక సమస్య నేరస్తుల పునరావాసం. జైళ్లలో కంటే సమాజంలోనే దొంగతనాలు ఎక్కువ. దొంగల్లేని ప్రదేశం ఈ భూప్రపంచంలో ఎక్కడా ఉండదు. ఈ దొంగలనే ఆంగ్లపాలకులు నేరస్తజాతులుగా ముద్రవేశారు. ఇందులో కొన్ని జాతులను చేర్చారు. ఆంక్షలతో వారి జీవితం అంధకార బంధురమైంది. భయం, మోసం, కపటం, కొట్లాటలు, పొడుచుకోవటం ఇవే వారి దైనందిన జీవితం. వీటికి తోడు దారిద్ర్యం, కష్టాలు, జబ్బులు, మనుష్యులంటే భయం వెరసి వారిదో అనిశ్చిత జీవితం. సభ్యసమాజంలో వీరికి చోటులేదు. వీళ్లకు మిగిలింది లాఠీ దెబ్బలు. ఈసడింపు మాటలు, శిక్షలు, కుటుంబం అనే మాటకర్థం లేకపోవడం. ఆనందం, సానుభూతి, గౌరవమర్యాదలు వీరికి మృగ్యం.

పుట్టుకతో ఏ వ్యక్తీ నేరస్తుడు కాదు. పరిస్థితుల ప్రాబల్యంవల్లో, సమాజంలో నెలకొన్న అశాంతి వాతావరణం, అలజడులు, మరే ఇతర కారణాలవల్లో నేరస్తులు తయారౌతారు. దానికి కారణం సమాజం. అంతేగాని వంశపారంపర్యంగా దొంగలుగా తయారవుతారన్న సిద్ధాంతాన్ని దీనికి అన్వయించలేం. ఇటీవల చారిత్రకక్రమంలో వచ్చిన సాంఘిక మార్పులు, ఆలోచనల్లో కొత్త పోకడలు తరతరాలుగా వస్తున్న నేరమనస్తత్వంలోని తపన, నేర ప్రవృత్తిని ఛేదించాలనే దృఢసం కల్పం, ఇవన్నీ నేరస్తజాతి సంస్కరణకు దారితీశాయి.

నేరస్తుల పునరావాసంకోసం ఇదివరకూ ఎన్నో ప్రయత్నాలు చేపట్టినప్పటికీ గోరా, లవణం, హేమలతగార్లు చేపట్టిన సంస్కరణోద్యమం తీరుతెన్నులు వేరు. 'సమాజమనే సుడిగుండంలో పడి ఒడ్డుకు చేరలేక, మునిగిపోలేక కొట్టుమిట్టాడే ఈ దొంగల జీవితాలు నిత్యం మనసులో కదులుతూ ఉండేవి' అంటారు హేమలతగారు. గరిక ప్రభాకరరావు అనే పేరుమోసిన నేరస్తుడు ఇప్పుడు మారిపోయాడు. 'మేము ఈ నేరాలు చేసి సంపాదించింది ఏమీలేదు. మాలో కొంతమంది కాళ్ళూచేతులు పోగొట్టుకున్నారు... మరికొందరు సజీవదహనం చెందారు. మాకు మిగిలింది పోలీసులు కొట్టిన దెబ్బలు మాత్రమే' అంటూ అతను హేమలతగారికి రాసిన ఉత్తరంలో పేర్కొన్నారు.

జాషువా దంపతులకు పుట్టిన హేమలత సమాజానికి అంకితమవుతారనీ, ఇంతటి మహత్తర సేవచేస్తారనీ ఎవరూ ఊహించి ఉండరు. ఆటపాటలతో గడిపిన ఆమెను ప్రముఖ నాస్తికవాది గోరాగారి కుమారుడు లవణం సేవాగ్రాంలో వివాహం చేసుకున్నాడు. అప్పట్లో ఇదొక సంచలనాత్మక వివాహం. వీరిద్దరూ సమిష్టిగా చేస్తున్న, చేసిన సామాజిక సేవ పలువురికి ఆదర్శప్రాయం. ఒకవైపున ప్రముఖకవి గుర్రం జాషువా కుమార్తె మానవతావాది, నాస్తికవాది గోరాగారి కోడలు.

సమాజంలో పతితుల, బాధా సర్పదష్టుల జీవితాల్లో వెలుగునింపటంకోసం, వారికొక గౌరవ స్థానాన్ని కల్పించటంకోసం నిర్విరామంగా కృషిచేస్తోన్న హేమలత వ్యక్తిత్వం అవార్డులకు, రివార్డులకు అందనిది. ఆమెకు ఆమే సాటి.

హేమలత జాషువా ఫౌండేషన్ స్థాపించి భారతీయ భాషల్లో ప్రముఖులైన సాహితీవేత్తలకు లక్షరూపాయల నగదు బహుమతినిస్తూ తన తండ్రి పేరు ప్రతిష్టలను, ఘనతను భారతదేశంలో నలుమూలలా వ్యాపించేట్టు చేస్తున్నారు.

హేమలతాలవణం స్వయంగా రచయిత్రి. నవలా రచయిత్రి. ఆమె రాసిన జీవన ప్రభాతం నవల సాహితీ పురస్కారానికి ఎంపికైంది. ఆమె అనుభవాలను, జ్ఞాపకాలను ఈ గ్రంథంలో రాశారు. ఆమె ఆత్మచరిత్రగా చెప్పదగ్గ ఈ గ్రంథం సామాజిక సేవారంగంలో పనిచేస్తున్నవారికి కరదీపికగా ఉపకరిస్తుంది. ❑

పాఠకులకు మనవి

మీకు లేదా మీవాళ్ళకు
న్యాయ సంబంధమైన
ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం
చేయాలో పాలుపోక
సతమతమవుతున్నారా? అయితే వెంటనే
ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి.
న్యాయవాది
శ్రీ జి.ఎల్.నరసింహారావు
తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.
మా చిరునామా:
ప్రజాశక్తి ఆదివారం అనుబంధం,
ఫ్లాట్ నెంబర్: 1,
అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

అతడి ఆస్తి... దక్కేదెవరికి?

మా దగ్గరి బంధువు ఒకామె తనకు తెలిసిన వ్యక్తిని ప్రేమించింది. అతణ్నే పెళ్లాడింది. అతడికి ఇదివరకే పెళ్లయిందనీ, ఇద్దరు పిల్లలున్నారనీ కొన్నాళ్ల తర్వాత తెలిసింది. ఇది తెలిసే నాటికే ఆమెకు ఒకబాబు పుట్టాడు. నిజం తెలిసిందని గ్రహించిన ఆ వ్యక్తి ఆమెను సాధించడం ప్రారంభించాడు. ఆమెను నానారకాలుగా అవమానించే వాడు. సూటిపోటి మాటలతో వేధించేవాడు. ఆమె అన్నింటినీ సహించింది. కొన్ని రోజులు అతనితో కాపురం చేసింది. అతని వేధింపులు శృతిమించాయి. ఆమె భరించలేకపోయింది. పుట్టింటికొచ్చేసింది. ప్రస్తుతం అతను చనిపోయాడు. అతడి ఆస్తిలో ఆమెకు వాటా వస్తుందా?

పేరు రాయలేదు

హిందూ ధర్మ శాస్త్రం ప్రకారం మొదటి భార్య ఉండగా, రెండవ పెళ్లి చేసుకోకూడదు. అది చట్ట ప్రకారం చెల్లదు. ప్రస్తుతం అతను చనిపోయాడు. అతని ఆస్తిలో వాటా మొదటి భార్యతో సమానంగా రెండవ భార్యకు రాదు. కానీ మొదటి భార్య పిల్లలతో సమానంగా రెండవ భార్య పిల్లలకీ వాటావస్తుంది.



ఆమె ఆస్తి... ఆమె ఇష్టం...

మా అన్నయ్యకు పిల్లలు లేరు. మాకు ఒకే ఒక కుమారుడు. మా బాబు మా అన్నయ్యదగ్గరే ఉండేవాడు. వాళ్లే అతణ్ని చదివించారు. పెరిగి పెద్దవాడయ్యాడు. మా అబ్బాయిని అతనికి దత్తత ఇవ్వలేదు. అయినా వాళ్లు మా బాబును వారి సొంత కొడుకులా చూసుకునేవారు. ప్రస్తుతం మా అన్నయ్య చనిపోయాడు. మా వదినె వారి ఆస్తిని వాళ్ల తమ్ముడితరపు వాళ్లకు ఇవ్వాలని చూస్తోందని తెలిసింది. ఆ ఆస్తి ఎవరికి చెందుతుంది? మా అబ్బాయికి వాటా రాదా?

రాము, వరంగల్

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది

మీ బాబు ఇప్పటికీ వాళ్ల దగ్గరే ఉన్నాడా? ఉంటే ఆ అబ్బాయిని మీ వదిన పుత్రవాత్సల్యంతో చూస్తున్నట్లుగదా! మీ పరిస్థితిని బట్టి చూస్తే మీరే లేనిపోని ఆందోళన చెందుతున్నట్లున్నారు. ఆస్తి కోసమని వారిరువురినీ విడదీసేటట్లున్నారు. భర్త ఆస్తి భార్యకే చెందుతుంది. కావున ఆ ఆస్తిని ఆమెకిష్టం వచ్చిన వారిపేరు మీద రాసుకోవచ్చు. ఎవరికైనా ఇవ్వవచ్చు.

ఇంటి సంగతులు

ఇంద్రగంటి జానకీబాల

ఇది చాలా స్వీటు గురూ!

రాత్రి పదకొండు గంటలకు రహస్యంగా శారద కూతురి గదిలో కెళ్లింది. నీరజ టేబిల్‌మీద తలాన్చి నిద్రపోతోంది. రేడియో మాత్రం మోగుతూనేవుంది. ఆమె జాగ్రత్తగా ఆ చిన్న రేడియోను చేతుల్లోకి తీసుకుంది.

శారదకు ఈమధ్య కూతురి ప్రవర్తన అంత పట్టట్లేదు. నీరజ మొన్నటి వరకూ తల్లిచుట్టూ తిరుగుతూ పుస్తకం పట్టుకుని చదువుకుంటూ తల్లితో ఏదో ఒకటి మాట్లాడుతూ, అవీఇవీ అడుగుతూ ఉండేది. నోట్‌బుక్స్ డైనింగ్ టేబుల్ మీదే పెట్టుకుని హోం వర్కులూ గట్రా చేసుకునేది. అలా చదివే టెన్త్‌క్లాసు మంచి మార్కులతో పాసయ్యింది. శారదకు కూతురి తెలివిమీద అపారమైన నమ్మకమేర్పడింది. కాలేజీలో చేరిన నీరజకు సెల్‌ఫోన్‌తోబాటు ఎఫ్ఎమ్ రేడియోకూడా చేతికొచ్చింది.

ఇల్లంతా సర్ది నీరజకు ఒక ప్రత్యేక గది, రాసుకునే టేబుల్, దానిమీద లైటు - ఇలా అన్ని హంగులూ ఏర్పడ్డాయి. అంతా బాగానే ఉంది గానీ, నీరజ తల్లి వెంట తిరుగుతూ చదువుకోవడం మానేసింది. కుదురుగా తన టేబుల్ ముందు కూర్చునే చదువుకుంటోంది. ఒకసారి శారద అదే మాటడిగితే "ఇప్పుడెలా కుదురుతుందే? నాకు బోలెడుంది చదవడానికి. పుస్తకాలన్నీ మోసుకుని తిరగలేను" అని తేల్చింది.

శారదకు తోచనట్లుగా ఉన్నప్పటికీ మరేం మాట్లాడలేకపోయింది. దానికితోడు నీరజకు తండ్రి సపోర్టు మరీ ఎక్కువైందీమధ్య. శారదకు తరచూ కూతురి గదిలోకి తొంగిచూసి ఏంచేస్తోందో, ఎలా చదువుతోందో, ఏం రాస్తోందో చూడాలనిపిస్తోంది. మరేంలేదు, కాలేజీలో ఎలాంటి స్నేహాలు చేస్తోందోనని భయం.

అయితే శారద ఎప్పుడుచూసినా కూతురు పకపకా నవ్వుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ కనిపిస్తోంది. రాసుకుంటున్నప్పుడు పక్కన రేడియోలో పాటలు సన్నగా వినిపిస్తున్నాయి. శారదకు ఆ వికవికలు, పకపకలు ఏమిటనిపిస్తుంది. అస్తమానూ పాటలు వింటూ ఉంటే ఇక చదువేం సాగుతుందీ అని ఆరాటం. ఒకసారి నీరజని నిలేసింది.

"అబ్బబ్బ ఏమిటమ్మా! నీకు చాదస్తం పెరిగిపోయింది. ఫ్రెండ్స్ ఉన్నప్పుడు సరదాగా మాట్లాడుకోమా ఏంటి?" అంది.

ఫ్రెండ్సంటే ఆడా, మగా అని అడగాలనుకుంది. కానీ ఆ మాట వింటే భర్త తిట్టిపోస్తాడని ఊరుకుంది.

"రాసుకున్నంత సేపూ ఆ రేడియో మోగుతూ ఉండాల్సిందేనా?" అని మూతి తిప్పింది.

"నాకదేం అడ్డం కాదమ్మా" అంటూ దీర్ఘం తీసింది నీరజ.

ఆ రాత్రి పదకొండు గంటలకు రహస్యంగా శారద కూతురి గదిలో కెళ్లింది. నీరజ టేబిల్‌మీద తలాన్చి నిద్రపోతోంది. రేడియో మాత్రం మోగుతూనేవుంది. ఆమె జాగ్రత్తగా ఆ చిన్న రేడియోను చేతుల్లోకి తీసుకుంది. 'జీరోజీరోజీరో పాయింట్ జీరో జీరో ఎఫ్ఎమ్... రేడియో హల్వా... ఇది చాలా స్వీట్‌గురూ' అంటూ వినిపించింది. ఇదేదో కొత్తగా అనిపించి వినడం మొదలుపెట్టింది. ముద్దు ముద్దు మాటలు, ముచ్చటైన నిట్టూర్పులు, టీనేజ్ అబ్బాయిల్నీ అమ్మాయిల్నీ ఆకర్షించే విధమైన ముచ్చట్లు.

'మురళీ తన క్లాస్‌మేట్ రవళిని గాఢంగా ప్రేమిస్తున్నాడు. ఆమె క్లాసుకు రాకపోతే అతనికీ కూర్చోబుద్దేయడం లేదుట. ఆమె కూడా చక్కగా నవ్వుతూ మాట్లాడుతుందట. వచ్చిన చిక్కేంటంటే ఆమె అందరితోనూ నవ్వుతూ మాట్లాడుతుందట. ఒక మంచి సమయం చూసి ఐ లవ్‌యు చెప్పేద్దామనుకుంటున్న మురళి ధైర్యంచేసి చెప్పలేకపోతున్నాట్ట. ఇంతలో మురళికి క్లోజ్‌ఫ్రెండ్ రాజా కూడా రవళిని ప్రేమిస్తున్నాడని తెలిసింది. మురళి త్యాగం చేసేద్దామనుకుని సిద్ధపడుతూ, కుమిలిపోతున్నాట్ట. ఈ పరిస్థితిలో తానేంచేయాలని రేడియో హల్వాకి ఎస్సెమ్మెస్ చేసి సలహా అడిగాడు. అదీకథ.

ముద్దుముద్దు మాటల హల్వా అమ్మాయి మురళిని బాగా ఓదార్చింది. 'ముందు మీరు మీ మనసులో మాట చెప్పండి. అసలు రవళి ఎవర్ని ఇష్టపడుతోందో, ఎవరికి ఐలవ్‌యు చెప్పాలనుకుంటోందో కనుక్కో, ఆమెకు ఒక ఎస్సెమ్మెస్‌కొట్టి నీమాట చెప్పెయ్. ఆ తర్వాత నీ త్యాగం గురించి ఆలోచిద్దుగాని" అంటూ హల్వా అమ్మాయి మురళిని బుజ్జగించింది. సగం ఇంగ్లీషు, సగం తెలుగు, ఒక తెలుగు వాక్యానికి ఇంగ్లీషు తర్జుమా.. ఇలా సాగిన ఆ మాటల గారడీ శారదకు భలే ఆశ్చర్యం కలిగించింది. ఆ హల్వా అమ్మాయి చెప్పిన కథతో శారద మనసు మూలిగింది. ఆమెకూడా ఆ సమస్యకు పరిష్కారం కోసం తీవ్రంగా ఆలోచించడం మొదలెట్టింది. ఆ తర్వాత గంటసేపు రేడియోహల్వా వింటూ శారద ఎంతో ఎంజాయ్ చేసింది. పదహారేళ్ల అమ్మాయిలా పడుచు ఆలోచనలు చేసింది. అంతలోనే ఉలిక్కిపడింది. ఇలాంటి రేడియో చెవిదగ్గర పెట్టుకుని పుస్తకాలు తెరిస్తే ఇక చదువేం సాగుతుందీ అని కలత పడింది.

కానీ మర్నాడు 'ఆ రేడియో వినొద్దు' అని కూతురిమీద యుద్ధం ప్రకటించలేకపోయింది శారద.

నీరజేం చిన్నపిల్లా ఏంటి? తన చదువు ఎలా చదువుకోవాలో తానే నిర్ణయించు కుంటుందిలెమ్మని సరిపెట్టుకుంది. అయితే ఆరోజు రాత్రి మళ్లీ రేడియో హల్వా ఎలాగైనా వినాలని శారద ఉవ్విళ్లూరడం ఆమెకే ఆశ్చర్యం కలిగించింది. ❑

ఇలా వుందామా...

వి. నాగరత్న

మనస్సాక్షి



"అర్జంటుగా స్టేషనరీషాపుకెళ్ళి తెల్లకాగితాలు కొనుక్కురావాలి" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"కొంపతీసి ఎవరికైనా ప్రేమలేఖలు రాయాలా?" పీవీ నరసింహారావులా పెదాలు సాగదీసి అడిగాడు చలపతి.

"లేఖలు రాయదగ్గ ముఖాలు కూడా వున్నాయా ఈ చుట్టుపక్కల?"

"మరెందుకట?"

"కథల పోటీ ప్రకటించారీ పత్రికలో, చూళ్ళేదా?"

"ఓ.. అదా?!"

"అదేంట్రా, బంపర్ బహుమతులు చూసినా నీకు ఊపు రాలేదా?"

"ఊళ్ళో పెళ్ళయితే మనకేం సంబరం? వాటిమీద కొందరి పేర్లు ముందే రాసుంటాయి"

"నీ అనుమానం కూలా! ప్రత్యేక పేజీలో తప్ప కథాకాగితాల్లో ఎక్కడా రచయిత వివరాలు రాయడానికి వీల్లేదని హెచ్చరించారు. అంటే దీనర్థం ఏమిటి? కథకు కోడ్ నంబర్లు మాత్రం వుంచుతారు. అంటే రచయిత పేరు, ఊరు తెలీదు గనుక న్యాయనిర్ణయం పకడ్బందీగా జరుగుతుంది"

"సరే, నీకు నమ్మకముంటే అలాగే రాసి పంపు"

"నువ్వు కూడా రాయరా బాబూ"

"నాకలాంటి భ్రాంతులేం లేవు"

❂ ❂ ❂

"ఏంటీ, ఇంటర్వ్యూకి వెళ్ళొస్తున్నావా?"

అవునన్నట్లు తలూపిన గణేశ్‌కేసి పరిశీలనగా చూస్తూ "ఏం, అడిగినవాటికి బాగా చెప్పలేదా?" అనడిగాడు ఆర్య.

"బ్రహ్మాండంగా చెప్పాను. కానీ, ఇదంతా కేవలం ఐవాష్‌కోసమంటున్నారు. ఆ మాట వినేసరికి ఎక్కడలేని నీరసం ముంచుకొచ్చింది. ఆ కేండిడేట్ ఎవరోగానీ డైరెక్టుగా అపాయింట్ చేసుకోక ఇంత హంగామా చేయడమెందుకు? పిచ్చిమొహాలేసుకుని రిటన్‌టెస్టులు, ఓరల్‌టెస్టులకు అటెండై చివరికి బేలచూపులు, బిక్కమొహాలతో సరిపెట్టుకోవాలా? ఇదంతా ఆడుకోవడం కాదా, నువ్వే చెప్పు?!"

❂ ❂ ❂

అన్నిసార్లూ పై ఉదాహరణలకు మల్లేనే జరుగుతుందని చెప్పలేం. వాళ్ళ అంచనాలకు తగినట్లు నిజాయితీగానే ఎంచుకుంటే ఇక అనుకోడానికేమీలేదు. కానీ కొన్నిసార్లు అన్యాయం జరుగుతోందని అనేక ఆరోపణలున్నాయి. ఎక్కడైనా, ఎప్పుడైనా పోటీకి వెళ్ళే అభ్యర్థికి ఎన్నో ఆశలు, ఆశయాలు వుంటాయి. నిజంగా తగినంత అర్హత లేకుంటే, చేయాల్సినంత పర్‌ఫెక్టుగా చేయకుంటే ఆశించినది దక్కకున్నా తేలిగ్గానే అందులోంచి బయటపడగలరు. 'పోనీలే, మనకంటే నైపుణ్యం వున్నవారికి ఇచ్చారు కదా? ఈసారి ఇంకా గట్టిగా ప్రయత్నిస్తే ఆ అవకాశం నాకే దక్కుతుంది' అనుకుంటారు. కానీ బాగా చేశాక్కూడా ఫలితం లేనప్పుడు ఎక్కడలేని నిరాశానిస్పృహలూ ఆవరిస్తాయి. అసలు వాటిమీదే సదభిప్రాయం పోతుంది.

ఆయా పత్రికాధిపతులు, సంస్థల యాజమాన్యం ప్రావీణ్యతకే ఆహ్వానం పలుకుతారు. కానీ మధ్యలో జరిగే అరాచకం వాళ్ళ దృష్టికి రాదు. ఇందులో దొర్లే కపటం లేదా కుట్రగురించి ఎవరూ వాదించలేరు, పోరాడలేరు. కారణం లంచాలైనా ఏ తెహెల్కాలాంటి కెమెరాకన్నుకో చిక్కుతాయిగానీ ఇవెట్టి పరిస్థితుల్లోనూ బయటపడవు. 'మా సెలక్షన్ కమిటీకి ఇదే సబబుగా అనిపించింది' అంటే ఎవరు మాత్రం బదులివ్వగలరు? ఎవరికి వాళ్ళు తమ మనస్సాక్షిని ప్రశ్నించుకుని నిజాయితీగా వుండటానికి మించి చేయగలిగిందేమీలేదు కదూ!.

❑





సీరియల్

గొల్లపూడి నారాయణరావు

జరిగిన కథ

అల్లుడు ఇంటికి రావడంతో రంగనాయకమ్మ చాలా సంతోషించింది. ఇక అఖిలాండం ఆనందానికి అవధుల్లేవు. ఈమధ్య జరిగిన హడావుడినంతా వివరించింది. తన నగలు, తల్లి నగలు అన్నీ రజాకారులెత్తుకుని పోయారని చెప్తూ 'ఇదంతా మీవల్లనే జరిగిందని ఊరంతా ఆడిపోసు కుంటున్నార'ని బాధపడింది.

(35 వ భాగం)

"మీరు ఊళ్ళోవాళ్ల నోళ్లలో నానడం నాకిష్టంలేదండీ"

"నన్నేం చేయమంటావు మరీ"

"మీరు ఇకనుండి దళాల్లోకి వెళ్లొద్దు"

"అఖిలా, తెలిసే మాట్లాడుతున్నావా?"

"తెలిసే మాట్లాడుతున్నాను. మిమ్మల్ని విడిచిపెట్టి నేను ఒక్కక్షణంకూడా ఇక్కడ ఉండలేను"

"అయితే నాతో బయలుదేరిరా, దళాల్లో నువ్వూ ఉందువుగానీ"

ఆ మాటలతో ఆమె ముఖం సంతోషంతో చేటంతయింది. "నిజమేనా మీ మాటలు! నన్ను నిజంగా మీ వెంట తీసుకెళతారా?"అంది.

"నిజమే అఖిలా, నిన్ను తప్పకుండా తీసుకెళ్తాను. కానీ దళాల్లో తిరగడం అంటే మాటలుకాదు. ఒక్కోరోజున నాలుగయిదు ఆమడల దూరం నడవవలసి ఉంటుంది. ఒక్కోసారి రెండు మూడు మైళ్లదూరం ఆగకుండా పరుగెత్తవలసి ఉంటుంది. ఆకలయినప్పుడు అన్నం దొరకదు. దప్పిక కాగానే నీళ్లూ దొరకవు. కొండల నెత్తిన కటిక రాళ్లపై పడుకోవాలి. చుట్టూరా ఎలుగొడ్లు, పెద్దపులులూ గాండ్రిస్తూంటాయి. వీటన్నింటికీ తట్టుకుని నిలబడగలిగే ధైర్యం ఉంటే బయల్దేరు"

"ఉన్నవీ, లేనివీ చెప్పి నన్నూరికే భయపెడుతున్నారు. కానీ ఇంత మాత్రానికే భయపడను. మీరు వెంట ఉంటే నాకు భయమెందుకు?"

"నిన్ను భయపెట్టాలని చెప్పడం కాదఖిలా, ఉన్న పరిస్థితులు వివరంగా చెప్పాను. తర్వాత నీ ఇష్టం. మీ అమ్మానాన్నలను అడిగి బయల్దేరు"

"అమ్మానాన్నా కాదంటారనా మీ అభిప్రాయం?"

"అడిగి చూడు ఏమంటారో తెలుస్తుంది గదా"

"మీ వెంట తప్పకుండా పంపుతారండీ. అందులో సందేహమేం లేదు" అందామె.

అంతలో బయట చెప్పుల చప్పుడు వినిపించడంతో "నాన్న ఇంటికి వస్తున్నట్లుంది" అందామె. వెంటనే లేచి నిల్చుంది.

"మావయ్య ఎక్కడికి వెళ్లాడు? ఇప్పుడింత ఎండలోబడి వస్తున్నాడు" అన్నాడతను.

"టౌన్ బేరగాళ్ళు వచ్చారట. బత్తాయిలు కోయించి బండికి వేయించడానికని తెల్లవారుఝాముననగా వెళ్లాడు" అంటోందామె. అంతలోనే కోదండరాంరెడ్డి గది గుమ్మంలోకి వచ్చి నిల్చున్నాడు. తండ్రిని చూడగానే ఆమె అక్కడినుంచి తుర్రుమని వెళ్లిపోయింది. ప్రతాప్ లేచి నిలబడ్డాడు.

"ఏం నాయనా, ఎప్పుడొచ్చావు?" అని పలుకరించాడు కోదండరాంరెడ్డి.

"ఇంతకుముందే వచ్చాను మావయ్యా" అన్నాడు ప్రతాప్. అంతలోనే అఖిలాండం కుర్చీ తీసుకొచ్చి వేసి "కూర్చోనాన్నా" అంది.

కూతురి వైపుకు చూసి నవ్వుతూ కూర్చున్నాడు కోదండరాంరెడ్డి. "దప్పిక అవుతోంది మంచి నీళ్లు తెచ్చిపెట్టూ" అన్నాడు.

"ఇప్పుడింకా మంచినీళ్లేమిటి నాన్నా? మధ్యాహ్నం కావస్తుంటేనూ, అన్నానికి లేచిరా, అమ్మతో అన్నం వడ్డించమని చెప్తాను"

"అబ్బాయితో కాసేపు మాట్లాడిన తర్వాత అన్నానికి వస్తాలే. ముందు మంచినీళ్లు తీసుకురా" అన్నాడు కోదండరాంరెడ్డి.

అఖిలాండం మంచినీళ్లు తెచ్చి తండ్రికి అందించింది. గటగటా తాగేశాడాయన. ఖాళీగ్లాసు కిందపెడుతూ "ప్రతాప్! మీరు దళంతో ఈ గ్రామం వదిలిపోయిన తర్వాత ఎంతో హడావుడి జరిగిపోయింది. పెద్దిరెడ్డిని మంటల్లో వేసి కాల్చి చంపేశాడు. పాపం మహాలక్ష్మమ్మ ఇల్లుపట్టనేలేదు" అన్నాడు.

"ఈ విషయమంతా మొన్న సాయంత్రమే తెలిసింది. బ్రహ్మారెడ్డిగారి అమ్మాయి చచ్చిపోయిందని విన్నాం" అన్నాడు ప్రతాప్ రెడ్డి.

"మహా అవమానకరంగా చచ్చిపోయింది. పాపం యాదవరెడ్డికి ఇస్తానన్న పిల్ల అది. సరేగానీ ఈ విషయాలన్నీ తెలిసిన తర్వాత యాదవరెడ్డి గుండెలు వగిలేలా ఏడ్చాడా?"

"లేదు మావయ్యా, యాదవరెడ్డిది రాతిగుండె. కాబోయే భార్య మానభంగంతో మరణించడం, తండ్రి మంటల్లో కాలి దగ్ధమైపోవడం విన్నప్పటికీ అతడు కంట తడి పెట్టలేదు. కానీ కత్తిపట్టుకుని పళ్ళు పటపటా నూరాడు. బడేమియాపై పగబట్టిన త్రాచుపాములా బుసలు పెట్టాడు. ఏ నాటికయినా ఈ ఘోర దురంతాలకు ప్రతీకారం చేస్తానని ఆవేశంతో మాట్లాడాడు"

కోదండరాంరెడ్డి తలూపి "అవును. యాదవరెడ్డి తొందరపాటు స్వభావం కలవాడు. అందులోనూ పసితనం. మా అఖిలమ్మ, యాదవ ఒక్కనెలలో పుట్టినవాళ్లే. చూడు అంత చిన్న వయసులో అతడి సంసారమంతా ఎట్లా విచ్ఛిన్నం అయిపోయిందో" అని భారంగా నిట్టూర్చాడు. "అంతా ఆ పరమాత్ముని లీలలు నాయనా" అన్నాడు తిరిగి.

"ఇప్పుడు యాదవరెడ్డి గిత్తలు, మిగతా గొడ్లు ఎక్కడున్నాయి? వాటినెవరు చూస్తారు?"

"ఆరోజే గిత్తలను చంపాలని మిలట్రీ పది తూటాల వరకూ కాల్చారట. కానీ అవి కాల్పులకందకుండానే తప్పించుకుని పోయాయి.

ఇప్పుడా గిత్తలు పులిగూడెంలో ఉన్నట్లుగా తెలిసింది. మిగతా గొడ్లు గాలికి తిరుగుతుంటే తోలించుకొచ్చి మన దొడ్లోనే కట్టేస్తున్నాను. కానీ యాదవ వచ్చి గొడ్లూగోదను ఒకసారి చూసుకుని పోకూడదూ?"

"అతణ్ణీ నా వెంట రమ్మన్నాను మావయ్యా, రానన్నాడు"

"ఇక్కడ జరిగిన బీభత్సమంతా తల్చుకుని రాలేకపోయాడేమోలే" అన్నాడు కోదండరాంరెడ్డి.

ఈ విధమైన సంభాషణ కాసేపు సాగింది. తర్వాత కోదండరాంరెడ్డి లేచి భోజనానికి వెళ్లాడు.

సాయంత్రం బారెడు పొద్దువేళప్పుడు మల్లారెడ్డి, కృష్ణారెడ్డి ఇరువురూ ప్రతాప్‌రెడ్డి వచ్చాడనే వార్తవిని వచ్చారు. ప్రతాప్‌తో సహా ముగ్గురూ కలిసి సందులో బావి వద్ద జామిచెట్టు నీడన కూర్చున్నారు.

"మీరు దళాన్ని పూర్తిగా మర్చిపోయారు" అన్నాడు ప్రతాప్‌రెడ్డి.

"లేదు ప్రతాప్, దళాన్ని కలుసుకోవాలనే ప్రయత్నంలో ఉన్నాం" అన్నాడు మల్లారెడ్డి.

"ఇన్నిరోజులు ఇక్కడేం చేస్తున్నారు? వెంటనే దళంలోకి వచ్చి ఎందుకు చేరలేదూ?" అనడిగాడు ప్రతాప్.

"దళం ఎక్కడున్న సంగతీ మాకు తెలియలేదు" అన్నాడు మల్లారెడ్డి.

"అందువల్లనే ఇక్కడ దిగబడిపోయాం" అన్నాడు కృష్ణారెడ్డి.

"నిజమే, మీరు కలుసుకోవడానికి దళం ఒక చోట ఉంటుందా?" అదీగాక దళం చాలా దూరప్రాంతంలో ఉంది" అన్నాడు ప్రతాప్‌రెడ్డి.

"దళాన్ని తీసుకుని రాకపోయావా ప్రతాప్? ఈ పక్కంతా రజాకారుల హడావుడితో బెదిరిపోతున్నారు" అన్నాడు మల్లారెడ్డి.

"సమయం వచ్చేసరికి తప్పుకుని పారిపోయారని కూడా అంటున్నారు" అన్నాడు కృష్ణారెడ్డి.

"ఇలా జరుగుతుందని అనుకోలేదు కృష్ణా. కొండల్లో రజాకారుల దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని రాజారెడ్డిగారు మన దళాన్ని అటు వెళ్లమన్నారు. తీరా అక్కడికి వెళ్లింతర్వాత తిరిగి రావడానికి వీలుపడలేదు. ఎక్కడ చూసినా మిలట్రీ క్యాంపులు ఎక్కువైపోయాయి. నేను ఒక్కడినీ రావడానికి నానా అవస్థలూ పడ్డాను. సన్యాసి వేషం వేసుకుని టౌను దాటి బయటపడ్డాను" అని చెప్పాడు ప్రతాప్.

మల్లారెడ్డి నవ్వి "నువ్వు సన్యాసి వేషం వేసుకున్నావా?" అన్నాడు.

"ఒక్క సన్యాసి వేషం ఏమిటోయ్? అవసరం పడితే అన్ని వేషాలూ వేయాలి" అన్నాడు ప్రతాప్. "నేను టౌను సమీపిస్తుండగానే పొద్దుకుంకవచ్చింది. ఈ వేషంలో టౌనుదాటి రావడం కష్టమని ఊహించాను. అప్పుడే ఒక సన్యాసి ఈ బాటన పడి వెళ్తున్నాడు. అతణ్ణి పిలిచి ఓ పదిరూపాయలు సమర్పించుకుని అతడి ఒంటినున్న కాషాయవస్త్రాలు తీసుకున్నాను. ఆ వస్త్రాలు నేను తగిలించుకుని టౌనులో ప్రవేశించాను. రజాకారులు గుంపులు గుంపులుగా వీధుల్లో కవాతులు చేస్తున్నారు. కానీ వేషంలో ఉన్న నన్నెవరూ గమనించలేకపోయారు. సరాసరి టౌనుదాటి బయటికి వచ్చేశాను" అన్నాడు.

"భలే ఉపాయం" అన్నాడు కృష్ణారెడ్డి.

తర్వాత చాలాసేపు మాట్లాడుకున్నారు. చివరికి ప్రతాప్ "ఏమోయ్ మీరిద్దరూ నిజంగా దళంలోకి వస్తారా?" అనడిగాడు.

"వస్తాం ప్రతాప్. ఇక్కడ ఉండలేకపోతున్నాం" అన్నాడు మల్లారెడ్డి.

"పగలల్లా పొలాల్లో ఉండి, చీకటిపడిన తర్వాతనే ఇళ్లకు చేరుకుంటున్నాం. ఎందాకని ఇలా చాటుమాటుగా తిరగడం?" అన్నాడు కృష్ణారెడ్డి.

"సరే అయితే ప్రయాణ సన్నాహంలో ఉండండి. ఈ రాత్రికే నా ప్రయాణం అన్నాడు ప్రతాప్"

"సరే" అంటూ వాళ్లిద్దరూ తలలూపి వెళ్లిపోయారు. అప్పటికే పొద్దుగుంకవస్తోంది. సుందరం అక్కడికి వచ్చి "మీరు వచ్చారని తెలిసి వచ్చాను. అయ్యగారిని అడిగితే జామచెట్టు కింద ఉన్నారని చెప్పారు" అన్నాడు.

ప్రతాప్ నవ్వుతూ సుందరాన్ని ఆహ్వానించాడు.

"రా సుందరం, ఇటుకూర్చో. ఏమిటీ విశేషాలు?" అన్నాడు.

సుందరం అతనికి సమీపంలో కూర్చున్నాడు. "మా బాధలు మీకు తెలియనివా?" అన్నాడు.

ప్రతాప్ తలూపాడు.

తిరిగి సుందరం కలిగించుకుని "ప్రతాప్‌గారూ, మా పరిస్థితి ప్రతి నిమిషం చచ్చి బతికినట్టుగానే ఉంది. ఎక్కడ ఏమాత్రం దువ్వ పైకిలేచినా మిలటరీ లారీలు వస్తున్నాయని బెదిరిపోవడమే జరుగుతోంది. అన్నివేళలా వాళ్లగురించే భయం. వాళ్లను గురించే వణికిపోవడం. తిన్న కాస్తా వంటబట్టడమేలేదు. నిద్రలోనూ అవే కలవరింతలు. గుండెలు నీరయిపోతున్నాయి" అన్నాడు.

ప్రతాప్ వింటూ మౌనంగా తలూపాడు.

"రూబేను ముందు మరీ బతకలేకపోతున్నాం. పొద్దుగుంకే వేళకు తప్పతాగి కొంపకు చేరతాడు. వాడవాళ్లందర్నీ నోటబట్టని బూతులు కూస్తున్నాడు. మిలటరీని తీసుకువస్తానని ప్రతిరోజూ బెదిరిస్తూనే ఉంటాడు" అన్నాడు తిరిగి సుందరం.

"రూబేను అంత పబ్లిక్ రజాకారుగా మారిపోయాడా సుందరం?" అనడిగాడు ప్రతాప్.

"పబ్లిక్ రజాకారేమిటీ? పచ్చి రజాకారులా తయారయ్యాడు. ఇక్కడి వార్తలు టౌనుకు నడిపేది వాడేగదండీ"? అన్నాడు సుందరం.

"అలాగా, ఇప్పుడాతడు ఇంటివద్దనే ఉన్నాడా?"

"లేదండి. ఇవ్వాళ పటేలుగారు వచ్చారు. ఆయనతోపాటు టౌనుకెళ్లి ఉంటాడు"

"ఏమిటీ ఇవ్వాళ ఇక్కడికి పటేలు వచ్చాడా?"

"వచ్చారండి. రూబేన్ను తీసుకుని పొలాలవైపుకు వెళ్లడం చూశాను"

ప్రతాప్ కాసేపు మాటామంతీ లేకుండా ఆలోచనలో పడ్డాడు. చివరికి "సుందరం మీ వాడ వాళ్ళందరూ కూర్చుని రూబేనును పిలిపించి అతడికి నచ్చజెప్పి మంచి మార్గానికి తేలేరా?" అన్నాడు.

"వాడు మేం చెప్తే వినేరకం కాదండీ"

"కాదని ఊరుకుంటే ఎట్లా? ఒకసారి మీవాడ పెద్దలంతా అతణ్ణి పిలిపించి చెప్పండి"

"మా వాడ వాళ్ల మాటంటే వాడికసలు లక్ష్యమేలేదు. ఇంకా ఒక విధాన మీబోటివారు మాట్లాడితే పద్ధతి మార్చుకుంటాడేమో ననిపిస్తోంది"

"అసలా వెధవతో మీకెందుకండీ? వాడెక్కడ ఊరేగితే మాత్రం మీకేమిటీ?"

"చూడు సుందరం, మన గ్రామం వాళ్లు కొందరు రజాకార్లతో కలిసి తిరగడం మన గ్రామానికి నామర్దా కాదూ?"

"నిజమేననుకోండి, కానీ ఆ మాటకొస్తే పటేలుగారు పూర్తిగా రజాకార్లతో కలిసి తిరుగుతున్నారు గదా?"

"పటేలు మనమెన్ని చెప్పినా వినడు. అతడు వెనుకటి నుండి ప్రభుత్వానికి వత్తాసు ఇస్తూ రకరకాలుగా గ్రామాన్ని పీడిస్తూ ఉండేవాడు. అతడికిది కొత్తేమీకాదు"

"రూబేను కూడా అంతేనండి. వెనుకటి నుండి పటేలుగారి అడుగులకు మడుగులు ఒత్తుతుండేవాడు. ఆయన రజాకార్లతో కలిశాడు కాబట్టి వీడూ కలిశాడు" అన్నాడు సుందరం.

ప్రతాప్ పైకి చూస్తూ ఆలోచనలో పడిపోయాడు. అప్పటికే మసకమసకగా చీకటిపడుతోంది. సుందరం లేచి నిల్చున్నాడు. "ప్రతాప్‌గారూ, ఇక వెళ్తానండీ" అన్నాడు.

ప్రతాప్ తలూపి "వెళ్లిరా సుందరం, మీరేమీ భయపడనక్కరలేదు. కొద్దిరోజుల్లోనే దళంతో మన గ్రామం వస్తాం" అన్నాడు.

తర్వాత సుందరం వెళ్లిపోయాడు. ప్రతాప్ లేచి ఇంట్లోకి వెళుతున్నాడు. పక్కగా నిలువు లోతున తీయించి ఉంచిన ఖాళీ పాతళ్లు కనిపించినయ్. అప్పుడే గొడ్డలి భుజాన పెట్టుకుని ఏసురత్నం వచ్చాడు.

"ఏసూ, పాతళ్లు తీయించి ఖాళీగానే ఉంచారేమిటీ?" అనడిగాడు.

(ఇంకా వుంది)

క్యాంపస్ ఛాట్

కె శివలీల

ఎక్కడ చూశాను చెప్మా?

అదే... నా ఎదురుగా కూర్చున్నాడే... అతన్నెక్కడో చూసినట్లు... అ తర్వాతేమైందంటే... అలాగే అతని వంక చూస్తున్నాను. అతను సడన్‌గా నా వంక చూశాడు. నేను చటుక్కున చూపు తిప్పుకున్నాను. ఇంకోసారి చూస్తే...

యువర్ అటెన్షన్ ప్లీజ్...
కృపయా ధ్యాన్ దీజియే...
ప్రయాణికులకు విజ్ఞప్తి...
ఈ సన్నివేశం ఎక్కడిదో గుర్తుపట్టారా? పోనీ చిన్న క్లూ ఇవ్వనా?
ఓ విశాలమైన ప్రదేశం... బ్యాక్‌గ్రౌండ్‌లో పైన చెప్పిన వాక్యాలు... పరుగులు తీస్తున్నవారు కొందరైతే... తాపీగా అటూ ఇటూ చూస్తూ మరికొందరు. కొందరిలో ప్రశాంతత, మరికొందరిలో నరాలు చిట్లిపోతాయేమోనన్న ఉత్కంఠత! అదీ ఒకే ప్రదేశంలో. ఎలా సాధ్యం అనుకుంటున్నారా? మీ మెదడుకు పదును పెట్టండి. మీ ఆలోచనలు పరుగులు తీస్తున్నాయా? ఆగండాగండి. గ్రీన్ సిగ్నల్ పడందే... హమ్మయ్య ఇప్పుడు సరైన ట్రాక్‌లోకొచ్చారన్న మాట. అవును మీరూహించింది కరెక్టే... మనం మాట్లాడుకుంటోంది రైల్వే స్టేషన్ గురించి.

"ఎవరైనా చూస్తారేమో... అన్న ఆలోచనే తట్టదు. 'కామెంట్ చేస్తారేమో...' అన్న విషయం అస్సలు గుర్తుకు రాదు. ఎందుకంటే అందుకోబోతున్న రైలుకోసం పరుగులు తీస్తుంటాను కాబట్టి. ఇలాంటి సమయంలోనే ఎవరైనా ఎదురొచ్చారనుకోండి?

కళ్లు సదరు వ్యక్తిని చూస్తున్నా మనసు ఆ దృశ్యాన్ని స్వీకరించదు. అందుకే చూసిందెవరినో స్పష్టంగా గుర్తుండదు. ఇంత ఆందోళనకి కారణం ట్రెన్ మిస్సవుతుందేవెూ అన్న చిన్ని భయం. చిన్ని భయమేంటి ఒకడుగు ఆలస్యమైందనుకోండి అదే పెద్ద నిజమౌతుంది. అంత అదుర్దాలో ఉన్నా... ఎప్పుడో ఒకసారి... 'ఈ ఫేసునెక్కడో చూసినట్లుందే...'అని మీకెప్పుడైనా అనిపించిందా? నాకు అప్పుడప్పుడూ అనిపిస్తూ ఉంటుంది. కానీ ఏం చేస్తాం. అప్పటికే మన అడుగులు ముందుకు పడతాయి. ఒక్కసారి వెనక్కి తిరిగి చూడాలనిపిస్తున్నా... చూడలేకపోతాం. ఒకవేళ చూసినా... కళ్లముందు కనిపిస్తున్న జనప్రవాహంలో ఆ వ్యక్తిని వెతుక్కోవడం చాలా కష్టం" ఇది ఓ అమ్మాయి మనోగతం. ఇలాంటి పరిస్థితులు మీలో ఎవరికైనా ఎదురయ్యాయా? అప్పుడు "షిట్...", "ఛ... మిస్సయ్యామే...", "ఫ్చ్... ఇంత కష్టపడి వెనక్కి తిరిగి చూసినా నో యూజ్..."అని మీరు స్పందించారా? నేను మాత్రం ఇలానే స్పందించాను అని చెబుతోంది మరో అమ్మాయి. మరి ఇలాంటి బిజీ షెడ్యూల్లో గజిబిజిగా పరుగులు తీస్తున్న వీరికి ఎదురైన కొన్ని అనుభవాలను తెలుసుకుందామా...

"మిమ్మల్ని ఎక్కడో చూసినట్లుంది...మీది విజయవాడా?" చాలా మంది అబ్బాయిలు నన్ను ఇలాగే అడిగేవాళ్లు... ఏ ఊరో తెలుసుకోవడానికిదో ప్లాను. నేరుగా మీదేవూరని ప్రశ్నించొచ్చుగా. మనుషులు వేరైనా డైలాగొక్కటే... ఈ ప్రశ్న నన్నడిగినప్పుడల్లా ఇలానే అనుకుంటాను నేను. "రొటీన్ డైలాగ్ బాబూ... వినివినీ బోర్ కొడుతోంది. కుచ్ న కుచ్ బదల్ సక్‌తేహైనా ఆప్" కొన్ని సందర్భాలలో బయటికే అనేసేదాన్ని. విన్న వాళ్లు విస్తుపోయేవారు. మరికొందరు టేకిటీజీగానే తీసుకునే వాళ్లు. కానీ ఓ రోజు... నాకూ అలాగే అనిపించింది. అదే... నా ఎదురుగా కూర్చున్నాడే... అతన్నెక్కడో చూసినట్లు... అ తర్వాతేమైందంటే.. అలాగే అతని వంక చూస్తున్నాను. అతను సడన్‌గా నా వంక చూశాడు. నేను చటుక్కున చూపు తిప్పుకున్నాను. ఇంకోసారి చూస్తే... వద్దులే... మరీ ఎక్కువగా ఫీలవుతాడు అనుకుని ఆ ధైర్యం చేయలేదు. నాకు అలా అన్పించడం అదే మొదటి సారి. అతన్నెక్కడ చూశాను? ఇదే ప్రశ్న నా మెదడును తొలుస్తోంది.

ఇంటికెళ్లి మా చిన్ననాటి స్నేహితుల ఫోటోలన్నీ చూశాను. అతని పోలికలేం కనబడవు. మా ఇంట్లో ఉన్న ఆల్బమ్స్, పెళ్లి క్యాసెట్లు అన్నీ జాగ్రత్తగా పరిశీలించాను. నో యఘాజ్... ఇక ఓ నిర్ధారణకొచ్చేశాను. ఏంటో గెస్ చేయండి చూద్దాం... ఇంకేముంటుంది. అతన్నెక్కడా చూడలేదనేగా. అంత సీన్‌లేదు. ఇతన్ని కచ్చితంగా పూర్వజన్మలోనే చూసుంటాను" అనుకుంటూ అతణ్ని పూర్వజన్మతాలూకు లిస్టులో వేసేస్తుందట అశ్విత. పూర్వ జన్మలో అతను ఇలాగే ఉండాల్సిన రూలేం లేదుగా... "అవును. అతను కుక్కో పందో అయ్యుంటాడు అందుకే సరిగ్గా చూసిన వెంటనే గుర్తుపట్టలేకపోయా" అంది. మరి అతను నిన్ను గాడిదో, గుర్రమో అనుకుంటే... "నన్ను సరిగా గుర్తించలేకపోయినందుకు ఐ పిటీ ఆన్ హిమ్... అది వాడి ఖర్మ... అనుకునివదిలేయాల్సిందే... మనమేం చేయలేం. లైట్‌గా తీసుకో..." అని జాలీగా సమాధానమిస్తోంది అశ్విత.

"ట్రైన్ బయల్దేరబోతోందని అనౌన్సుమెంటు వినిపిస్తోంది. నేను గబగబా మెట్లెక్కుతున్నాను. ఓ వ్యక్తి అంతే స్పీడుగా కిందకు దిగుతున్నాడు. తప్పుకుందామనే లోగా... నా చేతులో ఉన్న పుస్తకాలు కిందపడ్డాయి. పుస్తకాలేంటీ... నేనే మెట్ల మీంచి పడిపోవాల్సింది. ఎలాగో నిలదొక్కుకున్నాను. నా పుస్తకాలేవెూ దొర్లుకుంటూ వెళ్లి చివరిమెట్టుమీద ఆగిపోయాయి. అసలే లేటయిందనుకుంటే వీడివల్ల ఆ ట్రైన్‌కాస్త మిస్సయ్యేట్లుంది. అతనివైపు కోపంగా చూశాను. ఇంకేముంది... ఆ తర్వాత అతను కిందపడిన వస్తువులు మీకివ్వడం, మీకు సారీ చెప్పడం.... అంటూ కథ అల్లేస్తున్నారా? నేనూ అప్పటి వరకూ అలాగే అనుకున్నాను. ఆ తర్వాతే తెలిసింది అది చాలా పొరబాటని. ఎందుకంటే... అతను కనీసం సారీ కూడా చెప్పలేదు. కోపంగా చూసిన నావైపు నిర్లక్ష్యంగా చూసి, బుజాలెగరేస్తూ వెళ్లిపోయాడు. సినిమాలో చూపించేదంతా నిజం కాబోదనీ, మనకు థాష్ ఇచ్చిన వ్యక్తి హీరోలాంటి వాడై ఉండడనీ, జీవితం సినిమాకు పూర్తి విరుద్ధమనీ నాకు ఆ రోజే అర్థమైంది" అని వివరిస్తోంది ఈ అమ్మాయి. "పర్లేదు కాస్త ఆలస్యమైనా నిజాన్ని తెలుసుకున్నావ్" అనుకుంటున్నారా? ❑

సినిమా కబుర్లు

చందు



సీనియర్ నటి
శ్రీమతి జమున
చెప్తోన్న కబుర్లు

వడియాలతో సినిమా రంగంలోకి...

ఒకరోజు మా మాస్టారింట్లో పిల్లాపెద్దలం కలిసి వడియాలు పెడుతున్నాం. అందులో ఓ అరవయ్యేళ్ళ ముసలావిడ సినిమా కబుర్లు చెప్పడం మొదలుపెట్టింది. అక్కడితో ఆగక నాతో 'ఏమ్మా జమునా, మంచి ముక్కు కళ్ళు ఉన్నాయి. అందంగా ఉంటావే. సినిమాల్లో ఎందుకు నటించకూడదు? మావాడొకడు అంతా కొత్తవాళ్ళను పెట్టి సినిమా తీస్తున్నాడు. నేను రాజమండ్రి వెళ్ళి నీ గురించి చెబుతాను. తీరా అవకాశం వస్తే వద్దనకు' అంటూ అప్పటికప్పుడు నాకేదో సినిమా వేషం ఇచ్చేసినట్లు మాట్లాడింది. 'చాల్లే పెద్దమ్మా... పోచుకోలు కబుర్లు' అని మా మాస్టారి భార్య విసుక్కుంది. దీంతో ఆమెకు ఎక్కడలేని కోపం వచ్చి 'మా రాజాతో చెప్పి జమునకు వేషం ఇప్పించకపోతే, నన్ను మళ్ళీ 'నాయనమ్మా' అని పిలవొద్దు. నేనంటే మా రాజాకెంతో అభిమానం' అంటూ సవాలు చేసింది ('రాజా' అంటే డాక్టరు రాజారావుగారన్న మాట! ఆయనకు ఆవిడ పినతల్లి). నా తొలి సినిమా ఛాన్స్ మధ్యలో కొన్ని మలుపులు తిరిగి డా॥ రాజారావు చేతుల మీదుగానే 'పుట్టినిల్లు' చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయమయ్యాను.

మా నటనాకాలం ఒక స్వర్ణయుగం

పాతరోజుల్లో నిర్మాతలు, దర్శకులు, టెక్నీషియన్లు, నటీనటులు... ప్రతి ఒక్కరికీ సంఘంపట్ల ఒక బాధ్యతుండేది. సమాజంనుంచే పైకొచ్చాం, జనాలు ఆదరించబట్టే డబ్బు, పేరొచ్చింది. కాబట్టి ఈ కళ ద్వారా వారికి హాని చేయకుండా మంచిని ప్రబోధిద్దామన్న దృక్పథం ఉండేది. డబ్బు కంటే కూడా మంచి పాత్ర రావాలనుకునేవాళ్ళం. మనమున్నా లేకపోయినా ఆయా పాత్రలు ప్రజా హృదయాల్లో ఉండిపోవాలనే ఒక ధ్యాస, ఉత్సాహం ఉండేవి. మేం నటించిన కాలం సినిమా రంగంలో స్వర్ణయుగం. 1975వ సంవత్సరం నుండి అది మారుతూ వచ్చింది.

గ్లామర్ పేరుతో ఎక్స్‌పోజ్ చేస్తున్నారు

ఇక ఇప్పటి పరిస్థితి ఏమంటే... నటనక్కర్లేదు. సంగీతమక్కర్లేదు. అసలేమీ అక్కర్లేదు. గ్లామర్ ఉంటే చాలు. ఆ పేరుతో ఎక్స్‌పోజ్ చేస్తున్నారు. సావిత్రి, భానుమతి... మా అందం సహజసిద్ధమైంది. విగ్గులేవు. ఐ ల్యాషస్ లేవు. చెత్త మేకప్ లేదు. ఏమీ లేవు. ఇవేమీ లేకపోయినా సింపుల్‌గా ఒరిజినాలిటీతో అందాల తారల్లాగా చలామణి అవ్వలేదా? మహా నటీమణులు అనిపించుకున్నాం. కలర్ పిక్చర్స్‌లో నటించినా మేకప్ నేచురల్‌గా ఉండేది.

అసహజ వస్త్రధారణ, జుగుప్సాకర టేకింగ్

అసలు సినిమానే అసహజం. ప్రేమించుకున్నవాళ్ళు చెట్లూపుట్టలు పట్టుకుని ఎక్కడైనా పాటలు పాడతారా? అప్పుడు కూడా ఇటువంటి సీన్లున్నా సహజత్వానికి దగ్గరగా ఉండేవి. హీరోను చూసిన పల్లెటూరి అమ్మాయి కల కంటే... ఇప్పటి మాదిరిగా మోడ్రన్ బట్టల ముసుగులో ఒళ్ళంతా చూపిస్తూ ప్యారిస్‌లో ఈఫిల్ టవరెక్కి పాటలు పాడలేదు కదా! పల్లెటూరమ్మాయి స్విట్జర్లాండ్ మంచుపొరల్లో పాటలెలా ఊహించుకుంటుంది? ఆమె పాత్ర స్వభావం రీత్యా పట్టులంగాతో సహజత్వానికి దగ్గరగా చూపించేవారు. నేడు అసహజ వస్త్రధారణ, జుగుప్సాకర టేకింగ్ ఉంటోంది. అందుకేనేమో మా కాలంలో ఏడాదికి 70 సినిమాలు నిర్మిస్తే నగం చిత్రాలు విజయవంతమయ్యేవి. ఇవాళ 100కు పైగా వస్తుంటే పట్టుమని పది చిత్రాలు కూడా సక్సెస్ సాధించడంలేదు.

నైతికంగా దిగజారిపోయారు

డబ్బు సంపాదించాలన్న యావ ఎవరికైనా ఉంటుంది. అయినా ప్రతి ఆరిస్టు డబ్బు కంటే పాత్రలకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చేవారు. మునుపటిలా కొంతకాలం పరిశ్రమలో ఉంటామని ఇప్పుడొస్తున్న కథానాయికలు అనుకోవడంలేదు. ఉండేది కొంతకాలమేనన్న భావనతో మెంటల్‌గా ప్రిపేరై వస్తున్నారు. అలాగే దర్శకులు, టెక్నీషియన్స్... మారుతున్న కాలానికి, ప్రజల అభిరుచులకు అనుగుణంగా సినిమాలు తీయొచ్చు. కానీ నైతికంగా దిగజారిపోయి, సామాజిక బాధ్యతను కూడా మర్చిపోయి డబ్బే ప్రధాన ధ్యేయంగా సమాజాన్ని, యువతరాన్ని పూర్తిగా పెడదారి పట్టిస్తున్నారు. నిర్మాతలు ఒక్కటి మర్చిపోతున్నారేమో అని నాకనిపిస్తోంది. ప్రేక్షకులు ఏమైపోతే మనకెందుకు, డబ్బు వస్తోందిగా అనుకుంటున్నారేమో. కానీ అందులో వాళ్ళ పిల్లలు కూడా ఉంటారన్న విషయాన్ని మర్చిపోతున్నారు. మా నాన్న బూతు సినిమా తీయగా లేంది అర్ధనగ్నంగా డాన్సులేస్తే తప్పేంటనుకునే అవకాశాల్లేవా?!

'అందాల తార'గా ఉండిపోనివ్వండి

ఇప్పుడున్న ఈ వాతావరణంలో నేను అడ్జెస్ట్ కాలేను. డబ్బుకోసం నటించాల్సిన అవసరం లేదు. సీనియర్ ఆర్టిస్టులను ఎలా గౌరవించాలో తెలీదు. కనీసం పలకరించరు. హాయ్... అంటున్నారు. ఎన్టీఆర్, రామానాయుడుగార్ల పిల్లలు మాలాంటి వారిని టాప్ హీరోయిన్లుగా చూశారు. మేమేంటో వాళ్ళకు తెలుసు. మాపట్ల వాళ్ళకింకా గౌరవభావం ఉంది. కొత్తగా వచ్చినవాళ్ళకి జమున అంటే ఎవరో కూడా తెలీదు.

'మీ తోటివారు అత్త, అమ్మ క్యారెక్టర్స్ వేస్తున్నారు. మీరు కూడా నటిస్తే ఏదో ఒక క్యారెక్టర్ క్రియేట్ చేస్తారు. నటించవచ్చు కదా!' అని కొందరు అడిగారు. నేను ఎవర్‌గ్రీన్ హీరోయిన్‌గా రిటైర్ అయ్యాను. జమునంటే అందాల తార. ప్రజల హృదయాల్లో అలా ఉండిపోనివ్వండి. అత్త, అమ్మమ్మ, జేజమ్మ వేషాలు వేయాల్సిన అవసరంలేదు. దేవుడిచ్చిన దాంతో హ్యాపీగా ఉన్నాను.

గౌరవాన్ని కాపాడుకునేవాళ్ళం

నాతోబాటు కథానాయికగా నటించిన నటి ఓరోజు మా ఇంటికొచ్చింది. ఆమెకు నేనంటే చాలా ఇష్టం. నువ్వొక మంచి నటిగా గుర్తింపు, అవార్డులు తెచ్చుకున్నావు. ఎందుకా చిత్రంలో అల్లుడితో కలసి అశ్లీల, అసభ్యకర పాటలో డాన్స్ చేశావని అడిగాను. ఆర్థికపరమైన ఇబ్బందులని చెప్పేసరికి చాలా బాధ కలిగింది. అయినా నీవెందుకు చేయాలి. 'నటిగా జనాల్లో మంచి పేరుంది. 'నామీద ఇలా తీస్తే బాగుండద'ని ఎందుకు వారించలేదని అడిగాను. ఆ రోజుల్లో మాకిష్టం లేని పనిని ఏ నిర్మాతా, దర్శకుడూ చేయించేవాడు కాదు. ఆ తరహా సన్నివేశాలుంటే అటువంటి చిత్రాలను వదులుకున్న సందర్భాలూ ఉన్నాయి. 'పెళ్ళినాటి ప్రమాణాలు'లో నేను నటించాల్సిన డ్రీమ్ సాంగ్ ఇంగ్లీషులో ఉంది. గౌను వేసుకోవాలి. అప్పర్ క్లాత్ వేస్తేగాని నటించనని పోట్లాడాను. కె.వి. రెడ్డి లాంటి వారు మా ఇంటికొచ్చి 'కెమెరాను డౌన్‌లో పెట్టి ఇబ్బందికరమైన మూమెంట్స్ ఇచ్చి అసభ్యకరంగా చూపించము' అని నాన్నగారికి నచ్చజెప్పేసరికి ఒప్పుకున్నాను. క్యారెక్టర్ డిమాండ్ చేసినా కూడా ఆ రోజుల్లో ప్రతి విషయంలో ఎంతో ఖచ్చితంగా ఉండేవాళ్ళం. ఆ రోజుల్లో నేను కూడా గ్లామర్ క్యారెక్టర్స్ వేశాను. టెన్నిస్ డ్రస్ వేయాల్సివస్తే మోకాళ్ళ కిందివరకు వేశాను. ప్రేక్షకులు మాకిచ్చే గౌరవానికి భంగం కలగకుండా నడుచుకునేవాళ్ళం.

(ఇంకా వుంది)

పాడనా ఓ తెలుగు పాట...



కె.చంద్రునాయక్,
8వ తరగతి,
'ఎ' సెక్షన్, ఎస్.సి హాస్టల్,
జడ్.పి.హైస్కూల్,
గోపాల్‌పేట్,
మహబూబ్‌నగర్ జిల్లా.

నీ పాటకు నా సంగీతం తోడైతే...

ఎం.కార్తీక్, ఎం.రమణ, 10వ తరగతి,
చింతపల్లి, పెద్దూరు (గ్రా), విజయనగరం జిల్లా.

కర్ణకఠోరమైన సంగీతమెక్కడిది?!



బి.ముత్తు,
7వ తరగతి,
ప్రగతి విద్యాలయం,
గుమ్మడం (గ్రా),
పెబ్బేరు (మం),
మహబూబ్‌నగర్ జిల్లా.

చిన్నారి చిత్రకారులు

అదిగో అక్కడిది...

ఎం.హరీష్, 7వ తరగతి,
రణస్థలం, శ్రీకాకుళం.

అమ్మా! వాళ్లను ఆపమను...

ఇ.జ్యోతి, 10వ తరగతి, జడ్.పి.హైస్కూల్, నడుపూరు.

ఆపకపోతే చంపుతా...



ఎం.వినోద్‌కుమార్,
8వ తరగతి,
ఎ.పి.ఎస్.డబ్ల్యు.ఆర్ స్కూల్,
జూపాడు బంగ్లా,
నందికొట్కూరు (తాలూకా),
కర్నూలు జిల్లా.

హూ... ఇక్కడినుండి త్వరగా పారిపోవాలి.

పదా... వీళ్ల గురించి పోలీస్ అంకుల్‌కి చెప్దాం.



వేంద్ర భార్గవ్ తేజ,
8వ తరగతి,
విద్యా పబ్లిక్ స్కూల్,
నరసాపురం.



అదే నిజమైతే వాళ్లను హైదరాబాద్‌లో రద్దీగా వుండే ఏరియాలో ట్రాఫిక్ కానిస్టేబుళ్లుగా వేయాలి.

ఎం.రవితేజ,
6వ తరగతి,
శ్రీ సాయి హైస్కూల్,
హైదరాబాద్.

ఏ రెండు ఒకేలా వున్నాయి?

ఆర్టిస్టు అంకుల్ మీకు ఓ పరీక్ష పెడుతున్నాడర్రా! కింద 9 బొమ్మలున్నాయి. గబుక్కున చూస్తే అన్నీ ఒకేలా కనిపిస్తాయి. కాకపోతే రెండు మాత్రమే ఒకేలా వుంటాయి. ఆ రెండూ ఏవో కనుక్కోండి చూద్దాం.



అవి కావాలంటే....

హేయ్ చిన్నారులూ.... నేను పాండాని. కింద బొమ్మలో వున్నాను చూశారా! హమ్మయ్య. ఇప్పటికైనా గుర్తించినందుకు సంతోషం. అన్నట్టు నాకు ఒక సమస్య వచ్చిపడింది. అదేంటంటే... నాకు వెదురు మొక్కలంటే చాలా ఇష్టమని మీకూ తెల్సుకదా. ఇదిగో ఇక్కడ రెండు వెదురు మొక్కలున్నాయి. కాకపోతే గజిబిజి దారులు అడ్డున్నాయి. వాటిని దాటుకుంటూ ఎలా వెళ్లాలో కాస్త చెప్పండర్రా!



ఏడుకాళ్ల ఆక్టోపస్ ఏది?

చిన్నారులూ... ఆక్టోపస్ అంటే 8 అవయవాలున్న ప్రాణి అని మీకు తెల్సుకదా. కానీ ఇక్కడేమో ఆర్టిస్టు అంకుల్ ఓ ఆక్టోపస్‌కు 7 అవయవాలే వేశాడు. ఇంతకీ అది ఏదో గుర్తించండి చూద్దాం.



ఏంటబ్బా అది!

ఈ పిల్లాడు ఈత కొట్టడానికి దేని సాయం తీసుకుంటున్నాడో మీకు తెల్సా, తెలీదా? అయితే గబగబా పెన్నో, పెన్సిలో తీసుకుని వరుసగా చుక్కలన్నీ కలిపెయ్యండే.



అట్టమీది కథ

కాకర్లమూడి విజయ్

చదివే ఆసక్తి తగ్గిందా?

'నేను పుస్తకాలు లేకుండా జీవించలేను' అన్నాడు థామస్ జెఫర్సన్. ఈ మాట అనుకునే వాళ్లు ఈనాటికీ తక్కువేమీ కాకపోయినా సందర్భంలో మార్పు వచ్చింది.

ప్రస్తుత పరిస్థితులలో పుస్తకపఠనం, చదవడం పట్ల ఆసక్తి సన్నగిల్లుతోందన్న అభిప్రాయం కలిగించే ధోరణి బాగా పెరిగింది. అందుకు కారణాలు చాలా ఉన్నాయి.

ఆధునిక సమాజంలో ప్రాధాన్యతలు వేరేగా ఉన్నాయి. వేగం, కెరీరిజం, తీరికలేని ఉద్యోగాలు, చదువులు వంటి అలవాట్లతోపాటు చేతివేళ్ల క్రిందకి వచ్చేసిన ప్రపంచపటం... అంటే టెక్నాలజీ ప్రభావం కూడా చదివే అలవాటుతగ్గడానికి కారణమైంది.

"నా లైబ్రరీకి ఇంకా పాతతరం వాళ్లే వస్తుంటారు" అన్నాడు బాలకృష్ణ. ఇతను ఒక లెండింగ్ లైబ్రరీని దాదాపు 25 ఏళ్ల నుండీ నడుపుతున్నాడు. "వాళ్లు చదువుకునే రోజుల్లో ఇష్టపడిన పుస్తకాలనే ఇంకా తీసుకెళ్తున్నారు. ఇప్పటి పిల్లలు వచ్చినా మాగజైన్లు మాత్రమే అడుగుతున్నారు" అన్నాడు బాలకృష్ణ.

"పుస్తకాలను కొని చదివే అలవాటు మొత్తానికి బాగా తగ్గింది" అన్నాడు హుస్సేన్. ఇతను ఒక పుస్తకాల షాపు యజమాని. "పది పదిహేనేళ్ల క్రితం అమ్మాయిలూ అబ్బాయిలూ విపరీతంగా ఇంగ్లీషు నవలలు కొని చదివేవాళ్లు. ఇప్పుడైతే ఆ ధోరణి బాగా తగ్గిపోయింది. మేనేజ్‌మెంటు, ఐటీ వంటి కెరీర్ పరమైన పుస్తకాలూ, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ వంటి పుస్తకాలూ ఇప్పుడు బాగా అమ్ముడుపోతున్నాయి" అన్నాడాయన.

ఇందుకు కారణం ఏమై ఉంటుందన్న ప్రశ్నకు 'టైం లేదు' అన్నది ఆయన సమాధానం. ఇది కొంత వరకు సరైనదే అనిపిస్తుంది.

పుస్తకాలు బాగా చదవగలిగేది యువత. కానీ ప్రస్తుత పోటీ వాతావరణంలో ఇటు స్కూలు పిల్లలకూ అటు కాలేజీ, యూనివర్సిటీ వారికి వారి వారి పాఠ్య పుస్తకాలతోనే సమయం గడిచిపోతోంది. ఇక వేరే పుస్తకాలు చదివే అవసరమూ, అవకాశమూ ఎక్కడుంటుంది? 'మా ఇంట్లో అన్నీ పిల్లలకు ఉపయోగపడే పుస్తకాలే' అని చూపించిన శ్రీమతి సంధ్య 'అవన్నీ పోటీ పరీక్షల కోసమే' అనిప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమే రాలేదు. అవన్నీ రంగురంగుల అట్టలతో వేలాది పేజీలున్న ఆబ్జెక్టివ్ ప్రశ్నల పుస్తకాలు!

మరి అటువంటి పుస్తకాలేవీ చదవడం కిందికి రాదా అంటే రాదనే చెప్పాలి. పుస్తక పఠనం ఒక అనుభూతి. ఒక అద్భుత భావన.. ఒక అందమైన అనుభవం... ఒక కొత్త లోకాన్ని, వాతావరణాన్ని ఆవిష్కరించే సాధనం. ఒక కొత్త ఆలోచనకు సాన. ఒక కొత్త ఆలోచనకు అక్షర రూపం. గడచిన చరిత్రకు భవిష్య నిధి. మానవ మేధస్సు, కల్పనా శక్తికి కాలాతీత ఋజువు.

ఒక మంచి పుస్తకం ఆలోచింపచేస్తుంది! తనతో తీసుకువెళ్తుంది. తనలో దాచుకుంటుంది! సంచలనాన్ని సృష్టిస్తుంది. విప్లవాన్ని రగిలిస్తుంది.

ఫలానా విషయం కోసమైనా, ఫక్తు కాలక్షేపం కోసమైనా, విజ్ఞానాన్ని పెంచుకోవడం కోసమైనా, వినోదం అందుకోవడం కోసమైనా, మేధకు పదును పెట్టాలన్నా, సాధన చేయాలన్నా పుస్తకాలు మంచి నేస్తాలు.

నాగరిక జీవనంలో పుస్తకాలు అత్యంత ముఖ్యమైన సాధనాలు. ఇవి చరిత్రని తమలో దాచుకుంటాయి. కావలసినవారికి కథలుగా వర్ణిస్తాయి. కేవలం అక్షరాల అమరికనే కాక అంతులేని అనుభవాలనూ, అనుభూతులనూ అందిస్తాయి. రాసినవారి దృష్టిని చూపుతాయి. చదివే వారి దృష్టిని మారుస్తాయి.

లక్ష్యాన్ని తేలికగానే కాక త్వరగా చేరడానికి ప్రయత్నాలు ముమ్మరమౌతున్న ప్రస్తుత పరిస్థితులలో పాఠ్యపుస్తకాలే ఆసాంతం చదవలేని పరిస్థితులలో ఉన్నాం. అన్నింటికీ షార్ట్ కట్స్, అంతటా ఫాస్ట్‌నెస్. ఈ గందరగోళంలో పుస్తక పఠనం బాగా తగ్గిపోయింది. తుపాను హోరులా వచ్చిన టెలివిజన్. దానితో పాటే కమ్ముకున్న కంప్యూటర్. ఈ రెండూ మానవగతినే సమూలంగా మార్చివేశాయి.

"మాకు కావల్సిన సమాచారమంతా ఇంటర్నెట్‌లో క్షణాలపై దొరుకుతుంది. పుస్తకాలను రిఫర్ చేసే అవసరం లేదు. ఇక పుస్తకాలను అదీ కాల్పనిక సాహిత్యాన్ని చదివే తీరిక ఎక్కడిది?" ఇది ఒక మల్టీ నేషనల్ ఐటీ కంపెనీలో పనిచేసే సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్ ప్రశ్న.

"మా నాన్నగారు సేకరించిన పుస్తకాల జోలికే వెళ్ళే టైం లేదు. ఇంక నేను ప్రత్యేకంగా పుస్తకాలు కొని చదివేది ఎక్కడ?" అనడిగాడు కొత్తగా ఇంజనీరు అయిన రమణ.

"నేను న్యూస్‌పేపర్లు బాగా చదువుతాను. కొన్ని వార్తా పత్రికలూ చదువుతాను. నాకు కావలసిన సమాచారం దొరికిపోతోంది గనుక వేరే పుస్తకాలపై ఆసక్తి లేదు" అనేది ఎం.ఏ. చదువుతున్న శ్రీకాంత్ అభిప్రాయం.

టీవీ వచ్చినప్పుడు సినిమా పరిశ్రమ దెబ్బతింటుందన్న పుకారు పుకారులాగే ఉండిపోయింది. కానీ కంప్యూటరు, టీవీ కలిసి చదివే క్రియపై గట్టి ప్రభావాన్నే కలిగించాయి.

భర్తలు ఉద్యోగాలకు వెళ్ళిపోయాక మహిళలు, కాలేజీ నుండి వస్తూ వస్తూ విద్యార్థినులు తెలుగు నవలలను అద్దెకు తీసుకుని మరీ చదివేవాళ్లు. వారపత్రికల్లో రకరకాల సీరియళ్ళూ,



కథలూ కూడా అటువంటి ప్రజాదరణనే పొందాయి. కానీ టీవీలు మరింత ఆసక్తికరమైన కాలక్షేపాన్ని ఇస్తుంటే పుస్తకాలు ఎందుకు చదువుతారు? ఆ క్రమంలోనే ఎంతో పేరొందిన పాపులర్ రచయితలు సైతం పాపులర్ రచనల్ని మాని, లేదా తగ్గించి మరో రకం రచనవైపు మొగ్గు చూపుతున్నారు. 'నీ ఎదుగుదలకు, నీ భవిష్యత్తుకు పనికి వస్తాయి' అనే అంతర్లీన ప్రకటనతో వస్తోన్న వ్యక్తిత్వ వికాసం తరహా పుస్తకాలు ఊపందుకున్నాయి.

"అటువంటి పుస్తకాలవల్ల మనకేదో మేలు జరగవచ్చున్న ఆశ, నమ్మకం తోటే అవైనా చదువుతున్నారు గానీ లేకపోతే వాటిని చదివేవాళ్లు ఉండరు" అంటున్నాడు బాలకృష్ణ.

మరి హారీపోటర్ పుస్తకాల పట్ల విపరీతమైన క్రేజు ఏర్పడింది కదా అనడిగితే – "పాత కాలపు కాన్వెంటు పిల్లలు ఆ పుస్తకాలను కొన్నారేగానీ నారాయణ, శ్రీ చైతన్య లాంటి విద్యాసంస్థల పిల్లలు రాలేదు. తల్లిదండ్రుల వైఖరి కూడా పిల్లల అలవాట్లపై ఉంటుంది" అన్నాడు హుసేన్.

ఏం చదువుతున్నారు?

బాలల సాహిత్యం (అంటే కథలు) గత 5సంవత్సరాలలో తక్కువైంది. కానీ పిల్లలకు ఉపయోగపడే వివరాలు ఉన్న పుస్తకాలు (శాస్త్రీయ అవగాహన, జీవిత చరిత్రలు, జనరల్ నాలెడ్జ్, క్విజ్ విజ్ఞాన సర్వస్వం వంటివి) బాగా ప్రాచుర్యం పొందుతున్నాయి. ఆంగ్ల కాల్పనిక సాహిత్యంలో పేరొందిన రచయితల పుస్తకాలు ఈమధ్య బాగా తగ్గిపోయాయి. చాలాకాలం తరువాత ఫ్రెడెరిక్ ఫోర్సిత్ రాసిన 'ద ఆఫ్ఘన్' నవల టాప్ లిస్ట్‌లో ఉంది. ఆమధ్య 'ద డావిన్సి కోడ్' విపరీతంగా ప్రాచుర్యం పొందింది. అలాగే పిల్లలలో హారీపోటర్ నవలలు పాపులర్. తెలుగు కాల్పనిక సాహిత్య దిగ్గజాలనదగ్గ పలు రచయిత/త్రులు ఇటీవల రాయడం తగ్గించారు. కారణం తెలుగు కాల్పనిక సాహిత్యానికి చదువరులు తగ్గారు. టెక్నాలజీ సంబంధిత ప్రచురణలు భారీగా పెరిగాయి. కానీ అవి ఒక వర్గానికి మాత్రమే ఉపయోగపడుతున్నాయి.

పర్సనాలిటీ, సక్సెస్, టైం మానేజ్‌మెంట్ వంటి అంశాల పుస్తకాలు యువతను బాగా ఆకట్టుకుంటున్నాయి.

తెలుగు కవిత్వం బొత్తిగా పాఠకులను కోల్పోయి పుస్తకాలలో మాత్రం మిగిలిఉందంటున్నారు.

ఒక రకంగా పుస్తక పఠన పరిధిలోకి రానివే అయినా జోకుల సంకలనం, వంటల సంకలనం, వాస్తు ఫెంగ్‌షుయ్ వంటి పుస్తకాలు బాగా అమ్ముడవుతున్నాయి.

నిజమే. తల్లిదండ్రులు పిల్లలలో పాఠ్యేతర పుస్తకాలు చదివే ఆసక్తిని కలిగించాల్సిన అవసరం ఉంది. కానీ తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలకి వెళ్లి వచ్చేసరికి వాళ్ళకే ఓపికా, తీరికా, చివరికి చదవాలనే కోరికా ఉండటం లేదు.

ఇక పిల్లలకేం చెప్తారు? అయితే అందరూ ఈ విధంగా ఉండటం లేదు. 'ఆస్ట్రేలియా నుండి మా ఫ్రెండ్స్ వచ్చారు. వారికి అబ్దుల్‌కలాం పుస్తకాన్ని జ్ఞాపికగా ఇచ్చాను' అన్నారు శ్రీమతి శోభ. 'పుట్టిన రోజు పార్టీలకూ ఇతర సందర్భాలకూ వెళ్లేటప్పుడు ఒక మంచి పుస్తకాన్ని గిఫ్ట్‌గా ఇవ్వడం నా అలవాటు' అన్నారామె.

మంచి పుస్తకమంటే? చరిత్రా, సమకాలీనమా, కాల్పనికమా, శాస్త్రీయమా, కవిత్వమా, సాహిత్యమా, బాలల కోసం సృష్టించినదా? చెప్పలేం.

'ఏది అనిర్వచనీయమైన అనుభూతిని మిగుల్చుతుందో అదే మంచిది. జేమ్స్ క్లావెల్ రాసిన 'షోగన్' నవల నాకు అటువంటి అనుభూతినే మిగిల్చింది. దాన్ని నేను అయిదుసార్లు చదివాను. అయినా అందులోని పాత్రల పేర్లు చాలావరకు నాకు గుర్తులేవు' అన్నాడు రామం.

ఏదైనా పుస్తకం చదివినా దాన్ని ఆనందించకుండా, అనుభవించకుండా, అనుభూతి చెందకుండా ఉండటం ఈనాటి చాలామందికి అలవాటైపోయింది. దానికి కారణం పుస్తకంలో ఉండవలసిన అవసరం లేదు. మన దృక్పథంలోనే ఉంది. పోటీ పరీక్షలూ, క్విజ్ తరహా ప్రోగ్రాంలూ పుస్తకాలు చదివే పద్ధతిని పూర్తిగా మార్చివేశాయి. చదివిన పుస్తకంలోని 'ఫాక్ట్స్ అండ్ ఫిగర్స్'ని దాటిన అనుభూతిని మనకి కలిగించడం లేదు.

ఐఏఎస్‌కి సిద్ధమౌతోన్న ఒకతను మహారచయితల పేర్లూ, వారు రాసిన పుస్తకాల పేర్లూ దాదాపు యాభై వరకూ గుర్తుంచుకున్నాడు. ఆ యాభై పుస్తకాలలో ఒకటి కూడా అతను చదివే ప్రయత్నం చెయ్యలేదు. ఇటువంటివాళ్లు మనలో ఎంతోమంది ఉంటారు. కొన్నిసార్లు తాత్కాలిక సంచలనాలు పుస్తకపఠనం గణాంకాలను పెరిగినట్టు చూపిస్తాయి. 'డావిన్సి కోడ్' పై వచ్చిన వివాదం, సంచలనాత్మకమైన చర్చలు ఎప్పుడూ పుస్తకాలను చదవని వాళ్లను కూడా చదివించాయి. 'ఒక నెలపాటు ఆ పుస్తకానికి భలే డిమాండు వచ్చింది' అన్నాడు బాలకృష్ణ. 'ఆ పుస్తకంతో, డాన్ బ్రౌన్ రాసిన ఇతర పుస్తకాలనూ కొన్నవారున్నారు' అన్నాడు హుసేన్.

అసలు పుస్తక పఠనం తగ్గిందా?

సాధారణంగా మనకి పుస్తకాలు చదివేవాళ్లు తక్కువయ్యారని అనిపించినా ప్రచురణకర్తలు మాత్రం మరోరకంగా చెబుతున్నారు. 2004 సంవత్సరానికి ముందు చదివేవారు తగ్గినప్పటికీ ఆ తరువాత మాత్రం పుస్తకాల ప్రచురణ, అమ్మకాలు విపరీతంగా పెరిగాయని తెలుస్తోంది. పుస్తకాల ఎగుమతి, దిగుమతి కూడా బాగా పెరిగిందని, పుస్తక ప్రదర్శనల పట్ల ఆదరణ పెరిగిందని అంటున్నారు.



ఎవరు చదువుతున్నారు

30-50 మధ్య వయసు వాళ్లు ఎక్కువ పుస్తక పఠనం పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. 15-20 సంవత్సరాల మధ్య వారు సాహితీ పుస్తకాల జోలికి పోవడం లేదు. పిల్లల నుండి సరైన వివరాలు లభించలేదు. ఎందుకంటే వారి పఠనం ధోరణి స్థిరంగా ఉండదు.

డిగ్రీ, పీజీ విద్యార్థులు కొత్తగా పుస్తక పఠనం అలవాటు చేసుకోవడం బాగా తక్కువైంది.



పుస్తకాలు చదవడం నేర్పండి

చదవడం వచ్చినవాళ్లందరూ పుస్తకాలు చదువుతారని లేదు. చదవగల్గడం, చదివే అలవాటుండటం అనేవి రెండూ వేర్వేరు అంశాలు. బీ చదివే ఆసక్తిని, అలవాటును మీ కుటుంబంలో కలిగించాలంటే ముందు మీరు ఆ అలవాటును పెంచుకోండి. చిన్నారులను తరచూ లైబ్రరీలకూ, పుస్తకాల ప్రదర్శనలకూ, పుస్తకషాపులకూ తీసుకెళ్లాలి. బీ బొమ్మల పుస్తకాలను, కథల పుస్తకాలను పిల్లలకు అందుబాటులో ఉంచండి. అటువంటి పుస్తకాలను చదివి వినిపించండి. చదివించేందుకు ప్రయత్నించండి.

మొత్తానికి కాలక్రమేణా పుస్తక పఠనం తగ్గినట్టే ఉంది.

ఎన్నో లెండింగ్ లైబ్రరీలు మూతపడ్డాయి. వార్తా పత్రికలూ, ఇతర మాగజైన్లూ సర్క్యులేషన్‌ని పెంచుకున్నాయి. కొన్నిసార్లు పుస్తకాల ఖరీదు బాగా చదివే అలవాటున్న వాళ్లని కూడా వాటికి దూరంగా ఉంచుతోంది.

ఒకానొక సర్వే ప్రకారం 2000 సంవత్సరంలో పుస్తక పఠనం 30+ వయసువారిలో 52% ఉంటే, 30 -20 వయసు వారిలో 20% ఉంది. 15-20 వయసు వారిలో 12% ఉంది.

2002లో 30+ వయసువారిలో 20%కి పడిపోయింది. 30-20 వయసు వారిలో 10%కి పుస్తకపఠనం తగ్గింది.

'కొత్తగా అక్షరాస్యులైన వారూ, విద్యార్థులు పాఠ్యేతర పుస్తకాల జోలికి పోవడంలేదు. సమాచారమంతా పాయింట్ల రూపంలోనూ, ప్రశ్న – జవాబు రూపంలోనూ ఇస్తుంటే వారికి అదే బంగారం లాగా ఉంది. గత అయిదేళ్లలో నేను ఎక్కువగా అమ్మింది ఇటువంటి పుస్తకాలే' అన్నాడు హుసేన్.

"ముందునుండీ చదివే అలవాటున్నవాళ్లే కాస్త తగ్గించాల్సిన పరిస్థితి వచ్చింది. కారణం పుస్తకాల ధర అందుబాటులో లేకపోవడం. అయినా ఇంకా చదివే అలవాటు కొనసాగుతోంది కూడా వారి వలనే. ఈనాటి విద్యార్థులకు ఆ ప్రోత్సాహమూ, ఆసక్తీ, అవకాశమూ లేవు" అన్నాడు రామం.

నిజమే చాన్నాళ్లక్రితం పిల్లలూ పెద్దలూ ఆప్యాయంగా చదువుకున్న బాలమిత్ర ఇప్పుడు లేదు. ఎనిడ్ బ్లైటన్, ఆర్థర్ హెయిలీ, ఇర్వింగ్ వాలేస్, హెరాల్డ్ రాబిన్స్, యండమూరి, మల్లాది వంటి రచయితల పాత పుస్తకాలే దొరుకుతున్నాయి. పోటీ పరీక్షల్లో సిలబస్‌గా ఉంచకపోతే 'మహా ప్రస్థానం' మరుగున పడేదేమో! అవే పరీక్షల్లో అడగక పోతే గనుక ఏ పుస్తకం ఎవరు రాశారో కూడా పట్టించుకునేవారం కాదేమో !

పుస్తకం చదవడం అంటే మనతో మనమే మనసారా మాట్లాడుకోవడం. మనసు కిటికీ తెరిచి జ్ఞానవాయువులు పీల్చడం. ప్రతి పుస్తకం కనీసం ఒక్క కొత్త విషయాన్నయినా నేర్పుతుంది. వర్షమేఘమై కమ్ముకుంటుంది. అనుభూతుల జడిలో తడిపేస్తుంది.

'ఆc! వాళ్లెవరో ఏదో రాస్తే మనమెందుకు టైం వేస్ట్ చేసుకుని చదవాలి? అనే ప్రశ్నకు మనం సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. ఆధునిక సౌకర్యాల సాకుతో 'అబ్బే కుదరడం లేదు' అనేవారికి మన సానుభూతి ఇవ్వనవసరం లేదు. మనుషులు ఎదురుపడినప్పుడు 'బావున్నారా?' అనే కుశలం బదులు 'ఏం పుస్తకం చదువుతున్నారిప్పుడు?' అనగలిగే రోజు రావాలి. పుస్తకాల్ని బతికించుకోవాలి. అంటే వాటిని చదువుతూ మనం బతకాలి. బలహీనపడుతున్న 'పుస్తకాలు చదివే' అలవాటును అదృశ్యం కాకుండా అడ్డుకట్టు వేయాలి. పుస్తకాల్ని చదవాలి. చదవాలి... చదివించాలి కూడా!

❑





ఆరోగ్యం

డాక్టర్ సుధీర్ చౌదరి
ఇంప్లాంటాలజిస్ట్, అమీర్‌పేట్ సూపర్ స్పెషాలిటీ
డెంటల్ హాస్పిటల్, అమీర్‌పేట్, హైదరాబాద్.
సెల్ : 9885012444

కృత్రిమ దంతాలు

చాలామందికి కృత్రిమ దంతాల గురించి సరైన అవగాహన లేదు. అందుకనే కొంతమంది పళ్లు ఊడిపోతే ఆ ఖాళీలను అలాగే ఉంచేస్తారు. పళ్లు ఊడిపోవడం వయసుతో వచ్చే సహజమైన మార్పు అనుకుంటారు. కానీ ఒక్క విషయం ఆలోచించండి. మన శరీరంలో పళ్లు, జుట్టు తప్ప మిగతా భాగాలన్నీ చివరివరకు కొద్ది మార్పులతో అలాగే ఉంటున్నాయి కదా. మరి దంతాలు మాత్రమే ఎందుకు ఊడిపోతున్నాయి? కనుక అవి ఊడిపోకుండా ప్రతి నిత్యం తగినంత శ్రద్ధ తీసుకోవాలి. పద్ధతి ప్రకారం పళ్లను తోముకోవడం, పళ్ల మధ్య చిక్కుకున్న ఆహారపదార్థాల ముక్కలను ఫ్లాసింగ్ ద్వారా తీసెయ్యడం, నాలుకను శుభ్రపరుచుకోవడం, పళ్లు తోముకునేటప్పుడే చిగుళ్లను మసాజ్ చేస్తుండడం చేయాలి.

ఒకవేళ పళ్లపైనున్న ఎనామిల్ దెబ్బతిన్నా, కావిటీస్ ఏర్పడ్డా, పళ్లు పుచ్చిపోయినా, చిగుళ్లు వాచినా, నొప్పి పుడుతున్నా, రక్తం కారుతున్నా సకాలంలో సరైన చికిత్స తీసుకోవాలి. దంతాల చిగుళ్ల అనారోగ్యాలను తొలిదశలో తుంచివేయాలి. లేకపోతే పళ్లు, చిగుళ్లు క్రమంగా దెబ్బతిని పళ్లు ఊడిపోయే ప్రమాదముంది. ఒక పన్ను ఊడితే పక్కనున్న పళ్లు ఆ స్థలంవైపు వంగే అవకాశముంది. అలా జరిగినట్లయితే నెమ్మదిగా ఇవి కదలవచ్చు. కృత్రిమ పళ్లను అందం కోసమే కాదు, ఆరోగ్యం కోసం కూడా పెట్టుకోవడం అవసరం. వీటిని డెంటల్ ఇంప్లాంట్స్ అంటారు. ఇవి రెండు రకాలు. రోజూ బయటకు తీసి శుభ్రం చేసుకుని పెట్టుకునేవి, శాశ్వతంగా నోటిలోనే బిగించుకునేవి. వీటిని పర్మనెంట్ డెంచెస్ అంటారు. పళ్ల అచ్చులను తీసుకుని వాటి ప్రకారం సరిగ్గా సరిపోయేటట్లు, పక్కనున్న పళ్లకు భిన్నంగా కనిపించకుండా అదే రంగులో ఉండేటట్లు కృత్రిమ పళ్లను తయారుచేస్తారు. అమర్చిన తరువాత వీటిని కృత్రిమ పళ్ళుగా గుర్తించలేం. పెరియో డెంటిస్ట్, ఓరల్ డెంటిస్ట్ కలిసి పళ్లు ఊడిన స్థానంలో కృత్రిమ పళ్లను అమరుస్తారు. ఎన్ని పళ్లు ఊడినప్పటికీ వాటి స్థానంలో కృత్రిమ పళ్ళను నమలడానికి వీలుగా కదలకుండా అమరుస్తారు. వీటిని అమర్చే స్థానంలో ఎముక దెబ్బతినకుండా ఉన్నంత కాలం ఇవి గట్టిగా ఉంటాయి. చిగుళ్ల ఎముకలు సరిగా ఉండని వాళ్లు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, కీమోథెరపీ లేక రేడియేషన్ థెరపీ చేయించుకున్న వాళ్లు, థైరాయిడ్ సమస్యతో బాధపడుతున్న వాళ్లు, రక్తపరమైన జబ్బులున్న వాళ్లు, క్యాన్సర్ ఉన్నవాళ్లు ఈ కృత్రిమ పళ్లను అమర్చుకోవడానికి వీలవదు. మిగతా వాళ్లకు ఎలాంటి నొప్పి కలగదు. మరునాడే మామూలు పనులు తాము చేసుకోవచ్చు. ఏమైనా ప్రత్యేక జాగ్రత్తలు పాటిస్తే చాలు. ఈ పళ్లను జాగ్రత్తగా కాపాడుకుంటే దాన్ని బట్టి ఎంతకాలమైనా మన్నుతాయి. వాటిని బాగా శుభ్రంగా కడుక్కోవాలి. మూడు నుంచి ఆరు నెలలకోసారి దంతవైద్యుని కలుస్తుండాలి. వీటి ధర పళ్ల సంఖ్య, స్థానాన్ని బట్టి ఉంటుంది. తీసిపెట్టుకునే పళ్లకంటే శాశ్వతంగా ఉండే పళ్లు మంచివి. సహజపళ్లైనా, తీసిపెట్టుకునే పళ్లైనా, శాశ్వతంగా ఉండే పళ్లైనా, కృత్రిమ పళ్లైనా - ఏవైనాసరే ప్రతిరోజూ చక్కగా శుభ్రపరుచుకుంటే అవి బాగుంటాయి. ఇలా పళ్లను అమర్చుకోవడం వల్ల నలుగురిలో ఎలాంటి ఆత్మన్యూనతా భావం ఉండదు. నోటికి చెయ్యి అడ్డం పెట్టుకోకుండా మాట్లాడొచ్చు. మాట కూడా స్పష్టంగా వస్తుంది. ❑





కథ

కేతవరపు భాస్కర్

క్షవరం

ఆరోజు ఉదయం ఎప్పట్లాగే నిద్ర లేచిన అప్పారావు తన అందాల ముఖారవిందాన్ని అద్దంలో చూసుకున్నాడు. ఫేస్ పున్నమి చంద్రుడిలా మెరిసిపోతున్నా ఏదో తేడా కనిపించింది అతడికి. జులపాల్లా పెరిగిన జుట్టు తన అందమైన ముఖాన్ని అమావాస్య చంద్రుడిగా మార్చేస్తోందని గమనించాడు. 'అపరిచితుడి' లెవెల్లో పెరిగిపోయిన జుట్టును చూసి అతడికి యమా విసుగేసింది.

వారం రోజులుగా క్షవరం చేయించుకోవాలనే అనుకుంటున్నాడు. కానీ, ఆఫీసు పనితో కుదిరి ఛస్తేగా!

ఆరోజు సెలవు కావడంతో పొద్దున్నే సెలూన్‌కు బయల్దేరాడు.

చాలా రోజులుగా ఎయిర్ కండిషన్డ్ సెలూన్‌లో క్షవరం చేయించుకోవాలనే కోరిక అతడికి ఉండిపోయింది.

అదొక్కసారి గుర్తుకొచ్చింది. వెంటనే ఆ కోరిక పెరిగి పెద్దదైపోయింది. ఎలాగైనా ఏసి సెలూన్‌లో క్షవరం చేయించుకోవాలని అనుకున్నాడు. అనుకున్నదే తడవు... తన హీరోహోండాను అటు మళ్లించాడు.

ఎదురుగా 'స్టార్ సెలూన్' బోర్డు కనిపించడంతో బండి ఆపి స్టాండ్ వేశాడు.

బండి దిగుతున్నంతలోనే ఎదురుగా తెల్లప్యాంటు, అదే రంగు చొక్కా వేసుకున్న వ్యక్తి వినయంగా వంగి నమస్కారం పెట్టాడు. అప్పారావు ఉబ్బి తబ్బిబ్బయ్యాడు. నమస్కారం పెట్టిన వ్యక్తి అప్పారావును సాదరంగా లోపలికి తీసుకెళ్లాడు. మెత్తటి రివాల్వింగ్ కుషన్ ఛైర్‌లో కూచోబెట్టాడు.

సౌఖ్యంగా ఆశీనుడైన అప్పారావును సెలూన్ లోపలి వాతావరణం ఆశ్చర్యంలో ముంచేసింది. లోపల చల్లగా, హాయిగా ఉంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో అందంగా డిజైన్ చేసిన రూఫ్‌కు వేలాడుతున్న షాండ్లియర్ గది నలువైపులా వెలుగులు చిమ్ముతోంది. గోడలకు అమర్చిన ఇండోర్ ప్లాంట్స్ ఆ గదికి సారీ, సెలూన్‌కు మరింత శోభను తెస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ సెలూన్ స్టార్ హోటల్‌లా ఉందనుకున్నాడు అప్పారావు.

అంతకుముందు తాను క్షవరం చేయించుకున్న సెలూన్లు ఒక్కసారి గుర్తొచ్చాయి అతడికి. వీధి చివర బడ్డీ కొట్లలో... ఉక్కపోతలో... ఆ వాతావరణం తలచుకుంటేనే చిరాకుగా అనిపించింది అప్పారావుకి.

'ఇక్కడెంత హాయిగా ఉంది!' అనుకున్నాడు. ఎందుకైనా మంచిదని జేబు తడుముకున్నాడు. పర్స్ బరువుగానే తగిలింది. 'హమ్మయ్యా! ఫర్వాలేదు' అని తనలో తానే అనుకున్నాడు.

ఈలోగా అప్పారావుకి స్వాగతం పలికిన వ్యక్తి వచ్చాడు.

“సార్! హెయిర్ కటింగ్ చేయమంటారా? షేవింగ్ కూడానా?” వినయం ఉట్టిపడేలా అడిగాడు.

“కటింగ్, షేవింగ్ రెండూనూ. తల బాగా తగ్గించవోయ్!” దర్జాగా చెప్పాడు అప్పారావు.

ఆ వ్యక్తి అక్కడే ఉన్న బాయ్‌కు ఏదో చెప్పాడు. తాను లోపలికి వెళ్లి ఖాకీ రంగు యాప్రాన్ ధరించాడు. ఈలోగా బాయ్ ట్రే పట్టుకుని ప్రత్యక్షమయ్యాడు. అందులో మెత్తటి టర్కీ టవల్, కత్తెర, షేవింగ్ సామగ్రివంటివన్నీ ఉన్నాయి.

ఆ వ్యక్తి అప్పారావు తలకు ముందుగా మర్దనా చేశాడు.

"అబ్బా! ఎంత హాయిగా ఉంది!" అనుకున్నాడు అప్పారావు.

కాస్త నీళ్లు స్ప్రే చేసి ఆ వ్యక్తి హెయిర్ కటింగ్ మొదలుపెట్టాడు. ఒకసారి అతడివైపు చూశాడు అప్పారావు. ఎంతో అమాయకంగా ఉందా ముఖం. అప్పుడప్పుడే నలభయ్యో పడిలో పడుతున్నట్టున్నాడు. పళ్లు గార పట్టి ఉన్నాయి. పై వరుస పళ్లు చూస్తే ఏదో తేడా కనిపిస్తోంది. అది అతగాడి ముఖంలో అమాయకత్వాన్ని మరింత పెంచుతున్నట్టుగా ఉంది.

"మంచివాడే" అనుకున్నాడు అప్పారావు.

ఆ వ్యక్తి ఇవేవీ పట్టించుకోకుండా హెయిర్ కటింగ్ ఆరంభించాడు. కటింగ్ చేస్తుంటే అప్పారావుకు ఎంతో హాయిగా ఉంది. నెమ్మదిగా కళ్లు మూసుకుని ఆ సౌఖ్యాన్ని అనుభవిస్తూ కూచున్నాడు.

కాసేపు అయిన తరువాత "సార్! కటింగ్ పూర్తయింది. షేవింగ్ చేసేయమంటారా? లేక ఆయిల్ మర్దనా చేయమంటారా? ఆయిల్ మర్దనా చేయించుకోండి. హాయిగా ఉంటుంది" అని ఆ వ్యక్తి అన్నాడు.

ఇంత దూరమొచ్చాక అదెందుకు కాదనాలనుకుని "అలాగే, కానియ్య"మన్నాడు అప్పారావు.

ఆ వెంటనే మరో ట్రేలో 'నవరతన్ తైలం', ఇతర సామగ్రి అక్కడ ప్రత్యక్షమయ్యాయి. దానిని తలకు రాసి మర్దనా చేస్తుంటే అప్పారావుకు స్వర్గంలో ఉన్నట్టుగా ఉంది.

ఆ వ్యక్తి మర్దనా పూర్తిచేసి ఒళ్లంతా పట్టాడు. ఆ పైన ఎలక్ట్రికల్ వైబ్రేటర్‌తో ఒళ్లంతా నొక్కి రాశాడు. ఆ వైబ్రేషన్స్‌కు అప్పారావుకు గాలిలో తేలుతున్నట్టే ఉంది.

అది పూర్తయ్యాక ఆ వ్యక్తి తెల్లటి కాటన్ తీసుకొచ్చాడు. కాటన్‌తో అప్పారావు ముఖాన్ని నొక్కి రాశాడు.

"సార్! మీ ముఖం చూడండి! ఎంత మురికిగా ఉందో!! ఫేషియల్ చేయించుకోండి సార్! ఇదంతా పోతుంది. మీ ముఖం ఫ్రెష్‌గా ఉంటుంది" అన్నాడు.

అప్పటికే గాలిలో తేలుతున్న అప్పారావు చటుక్కున "సరే!" అనేశాడు.

మళ్లీ మరో ట్రే వచ్చింది. ఆ వ్యక్తి అప్పారావు కూచున్న కుర్చీని వెనక్కు వాల్చాడు. మరింత సౌఖ్యంగా అప్పారావు పడుకున్నాడు. సారీ, కూచున్నాడు.

ఈలోగా ఆ వ్యక్తి అప్పారావు కళ్లపై రెండు దోసకాయ (కుకుంబర్) ముక్కలు పెట్టాడు. దానిపై చల్లటి నీళ్లలో ముంచి తీసిన కాటన్ పెట్టాడు.

రెండు కళ్లూ మూసేయడంతో ఆ వ్యక్తి ఏం చేస్తున్నాడో అర్థం కాని స్థితిలో ఉన్నాడు అప్పారావు.

ఆ వ్యక్తి ఏదో పేస్ట్ ముఖానికి రాశాడు. కాసేపు ముఖమంతా తోమాడు. మళ్లీ పేస్ట్ రాశాడు. మళ్లీ తోమాడు. ఇలా ఓ ఐదు నిమిషాలు గడిచాక తడిగుడ్డతో ముఖమంతా తుడిచాడు. మళ్లీ పొడి గుడ్డతో తుడిచాడు. కళ్లపై ఉంచిన కుకుంబర్ ముక్కలు తీసేశాడు. తెల్లటి కాటన్‌తో ముఖంపై రాసి "సార్! చూడండి మీ ముఖం ఎంత క్లీన్‌గా ఉందో" అన్నాడు.

అప్పారావు నిజమేననుకున్నాడు.

ఆ తర్వాత షేవింగ్ కూడా పూర్తి చేశాడు ఆ వ్యక్తి.

అంతా పూర్తయ్యాక అద్దంలో తన ముఖం చూసుకుంటూంటే ఆ వ్యక్తి ఒక ఫోల్డర్ తెచ్చి అప్పారావు ముందుంచాడు.

"ఇదేమిటిది? స్టార్ హోటల్‌వాడు బిల్లు తెచ్చినట్టు?" అని అప్పారావు అనుకున్నాడు. అది నిజంగా బిల్లే.

సరే ఎంతైందోనని అప్పారావు ఆ బిల్లు చూశాడు. అక్షరాలా ఐదువందల రూపాయలైంది. గుండె గుభేలుమంది అతడికి. మళ్లీ కళ్లు నులుముకుని చూశాడు. అంతే కనిపిస్తోంది. స్టార్ సెలూన్‌లో కళ్లముందు పట్టపగలే అప్పారావుకు నక్షత్రాలు కనిపించాయి.

హెయిర్ కటింగ్‌కు వంద, షేవింగ్‌కు యాభై, ఆయిల్ మర్దనాకు నూట యాభై, ఫేషియల్‌కు రెండు వందలు వెరసి... మొత్తం ఐదువందల రూపాయలు. తన జీతంలో, జీవితంలో వారం రోజులకు సరిపోయే మొత్తం అది.

'చేసుకున్నవాడికి చేసుకున్నంత' అన్నారు. ఇంతవరకూ వచ్చాక తప్పదు కదా! జేబులోంచి తీసి ఐదువందల రూపాయల నోటు ఆ వ్యక్తికిచ్చాడు. అది ఫోల్డర్‌లో పెట్టుకుని మళ్లీ చెయ్యి చాపాడా వ్యక్తి.

"ఏంటి?" ప్రశ్నించాడు అప్పారావు.

"టిప్ సార్" గార పట్టిన పళ్లు ఇకిలించాడా వ్యక్తి.

అతగాడికింకో పది రూపాయలు సమర్పించుకుని కళ్లలో నీళ్లు కుక్కుకుంటూ ఇంటికి బయల్దేరాడు అప్పారావు. ❑



సెన్సు కామన్ సెన్సు

మొలకలపల్లి కోటేశ్వరరావు

మగపనీ... ఆడపనీ...

మొన్నోరోజు విడిచిన బట్టలు చాలా పేరుకుపోయివుంటే, ఇంటిముందు ట్యాప్ దగ్గర చాకిరేవు పెట్టుకున్నాను.

హైదరాబాద్ నుంచి వచ్చిన మా బంధువుల అమ్మాయి చిన్ని పొరుగింటి నించి మా ఇంట్లోకి వస్తూ, నోరు తెరిచి అలాగే ఆశ్చర్యంగా, విభ్రాంతిగా, వింతగా నావైపు చూస్తూండిపోయింది.

"ఏంటి చిన్నీ?" అనడిగాను.

"అదేంటి బాబాయ్... బట్టలు నువ్వు ఉతుక్కుంటున్నావేమిటి?" అంది అంతే ఆశ్చర్యంతో.

"ఎవరు ఉతకాలంటావు?"

"పిన్ని లేదా?"

"లోపలుంది. అయినా ఇవి నా బట్టలు. నావి నేను ఉతుక్కుంటే తప్పేముంది? నా బట్టలు మరొకరు ఉతికితే తప్పవుతుంది! ఒకరు విడిచినవి మరొకరు ఉతకాలంటే ఎంత అసహ్యం!"

"అది కాదు బాబాయ్.. మగవాళ్ళు బట్టలు ఉతకడం ఏమిటని నా సందేహం?"

"ఏం కాదు చిన్నీ, ఎవరి పనులు వాళ్ళు చేసుకోవాలి. అలా చేసుకోవడం మంచి అలవాటు, మంచి పద్ధతి"

నాలుగో, ఐదో చదువుతోన్న పదేళ్ళ చిన్నికి నేనన్నది అర్థంకాలేదు. నా సమాధానం ఏమీ సంతృప్తి పరచలేదని ఆ పాప ముఖంలోని ఫీలింగ్సే చెపుతున్నాయి. పిన్ని బట్టలుతికితే చిన్ని ఏమాత్రం ఆశ్చర్యపడేది కాదు. చాలా సహజంగా, మామూలుగానే ఆ దృశ్యాన్ని స్వీకరించివుండేది.

మన సమాజంలో కొన్ని పనులకు విభజన జరిగిపోయింది– ఆడపనులు, మగపనులుగా. అయితే ఇవాళ మగపనులు ప్రత్యేకంగా ఏమీలేవు. మగవాళ్లు చేసే అన్ని పనులూ ఆడవాళ్లు చేస్తున్నారు. పెద్దపెద్ద యంత్రాలు నడపడం దగ్గర్నించీ... లాయర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, కండక్టర్లు, కమీషనర్లూ ఒకటేమిటి... ఆడవాళ్లు లేని రంగమేలేదు.

అయితే ఆడవాళ్ళకంటూ ఒకప్పుడు ప్రత్యేకించిన పనులు మాత్రం మగవాళ్ళు ఇప్పటికీ చేయడంలేదు. పురుషాహంకారం, పురుషాధిక్యత లాంటి లక్షణాలు ఇందుకు తోడవుతున్నాయి.

చిన్ని అమ్మానాన్న ఇద్దరూ ఉద్యోగస్తులే. వాళ్ళనాన్న కంటే కూడా వాళ్ళ అమ్మదే పెద్ద ఉద్యోగం. అంటే ఎక్కువ జీతం, ఎక్కువ హోదా! చిన్ని నాన్న నాకు బాగా తెలుసు. ఇంట్లో చిన్న పని కూడా ముట్టుకోడు. ఎదురుగావున్న ఫ్రిజ్‌లోంచి మంచినీళ్ళు సైతం అందుకోడు. ఇంటిపని ఆడవాళ్ళే చేయాలనుకుంటాడు. మగవాళ్ళు ఇంట్లో పని చేయకూడదనేది అతని పాలసీ. ఎంతపనిలో వున్నాసరే భార్య లేచి అతనికి మంచినీళ్ళు ఇవ్వాల్సిందే. తానే తీసుకోవడమనేది ఆడంగి లక్షణం అతని దృష్టిలో. ఇంట్లో పని చేస్తే అది తన పరువుకీ, మర్యాదకీ, మగతనానికీ భంగకరమని అతని భావన.

ఇంట్లోనూ, ఆఫీస్‌లోనూ పని భారం అధికమై చిన్నీవాళ్ళమ్మ పడే బాధలు, వేదనలు చెప్పలేం. టెన్షన్, ఆందోళన, ఒత్తిడి, అలసట, పరుగు! ఒక దశలో ఆమె మానసికంగా కూడా బ్యాలెన్స్ కోల్పోయే పరిస్థితి దాపురించింది.

కొంతమంది ఇంట్లో పని చేయడానికి సిద్ధమేకానీ.. ఎవరైనా, ఏమైనా అనుకుంటారని జంకుతూ, సిగ్గుపడుతూ చేస్తుంటారు. సుబ్బారావు అలాంటి బాపతే! సుబ్బారావు అంట్లు తోమాల్సివస్తేనో, బట్టలు ఉతకాల్సివస్తేనో తలుపులన్నీ బిగించుకుని దొడ్లో పని చేస్తుంటాడు. ఎవరైనా వచ్చి తలుపు తడితే తత్తరపడుతూ, బిత్తరచూపులతో కంగారు కంగారుగా అన్నీ ఒక పక్కకి సర్ది వచ్చి తలుపు తీస్తాడు. పాపం, అతనికి పని చేసేందుకేం నామోషీలేదుకానీ, ఎవరైనా చూస్తారని భయం.

చాలా కుటుంబాల్లో సర్వసాధారణంగా ఆడవాళ్ళే ఇంటిపనీ, వంటపనీ చేస్తుంటారు. మగవాళ్ళు చేయి పెట్టరు. ఇదొక అలవాటుగా, సంప్రదాయంగా స్థిరపడిపోయింది. ఆడవాళ్ళను వంటింటికే పరిమితం చేయడానికి ఏర్పరిచిన అలవాట్లు, కట్టుబాట్లు ఇవి.

కుటుంబంలో భార్య, భర్త ఇద్దరూ సమానమే! ఒకరు ఎక్కువా, ఒకరు తక్కువా కాదు. పనులు ఇద్దరూ కలిసి సమంగా చేసుకోవాలి. ఎవరి వీలుని బట్టి వాళ్ళు పని చేయాలి. ఒకరి పనిలో మరొకరు సహాయం చేసుకోవాలి. పిల్లలకి కూడా చిన్నచిన్న పనులూ, బాధ్యతలూ అప్పగించాలి. ఒక సినిమా కవి అన్నట్లు "ఆడుతు పాడుతు పని చేస్తుంటే అలుపూ సొలుపేమున్నదీ../ ఇద్దరమొకటై చేయికలిపితే ఎదురేమున్నదీ... / మనకీ తిరుగేమున్నదీ..."

ఎంతో బాగా చెప్పారు కదూ?! నిజంగా భార్యాభర్తలు ఇద్దరూ విభజన లేకుండా ఇంటిపనీ, వంటపనీ 'ఆడుతూ పాడుతూ' పనులు చేసుకుంటే ఇక ఆ కుటుంబానికి ఎదురేమున్నది? ఆ జంటకి తిరుగేమున్నది?

❑

మైకంటే...

మైకంటే తెలుసా మీకు?
నాయకులు పొరపాటున
నిజాలు చెప్పినా
అబద్ధాలుగా మార్చి
జనానికి
వినిపింపచేసే ఓ యంత్రం
(ఆత్రేయగారి ఆలోచనకు అక్షరరూపం)

జె.కె. భారవి

తస్మాత్ జాగ్రత్త

నిన్న
పాలకులకోసం
పాలితులు తలలు గొరిగించుకున్నారు
నేడు
పాలకులు
పాలితుల తలలు గొరుగుతున్నారు
రేపు
పాలితులు
పాలకుల తలలు నరుకుతారు

ఓటాయుధం

నేను ఓటును
నన్ను సరిగ్గా ఉపయోగించుకో
లేదా
ఐదేళ్ళదాకా దేవుడు కూడా
వినడు మీ గోడు



మీరేం పెద్దమనిషి?!

రమణి ఓ పత్రికా సంపాదకుడి దగ్గరికి వెళ్ళింది.
రమణి: సార్, నేనో కథ పంపి చాలాకాలం అయింది. ఎంతోకాలం ఎదురుచూసి విసిగిపోయి వచ్చాను... కాస్త ఆ కథ ఏమైందో చెప్తారా?
ఎడిటర్ కథల ఫైల్ తెప్పించి చూశారు. దానిపై రాసిన చిన్న నోటును చింపేసి, కథను ఆవిడకు తిరిగిస్తూ "ఇది బాగా డ్రైగా వుందమ్మా... కాస్త మనసుకు హత్తుకునేలా రాయాలి" అన్నారు.
రమణి చాలా చిరాగ్గా చూస్తూ "మా ఆయన చెప్పినంత పనీ అయింది" అంది.
ఎడిటర్: ఆయనేమన్నారేంటి?
రమణి: పత్రికాఫీసుకు వెళ్ళకు, ఆనక చింతిస్తావని
ఎడిటర్: ఇందులో బాధపడేందుకేముంది? కాస్త హత్తు...
రమణి: అదిగో మళ్ళీ అదే మాట.. నీతులు రాయడానికేనా? హత్తుకోడాలు, దగ్గరకు తీసుకోడాలూ ఏంటి అసహ్యంగా?! పెద్దమనిషి తీరేనా ఇది?! (అనేసి చరచరా వెళ్ళిపోయింది)

– లేఖ

మనసా... తెలుసా?

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్, ఫోన్ : 9849130141

హిప్నో కమలాకర్

నేను డిగ్రీ ఫస్టియర్ చదువుతున్నాను. నా సమస్య కొత్త వ్యక్తులతో మాట్లాడాలన్నా, అందరిలో మాట్లాడాలన్నా నాకు గుండెదడగా వుంటుంది. మాట తడబడుతూ నత్తి వస్తుంది. ఇందువల్ల మానసికంగా బాధపడుతున్నాను. దయవుంచి నత్తి తగ్గేందుకు మంచి సలహా ఇవ్వగలరు.

వరప్రసాద్, కర్నూలు

మాట్లాడడమనేది ఫిజికల్, ఇంటలెక్చువల్ ప్రక్రియలకు సంబంధించినది. మెదడులో పుట్టే ఆలోచనలకు మనలో నిక్షిప్తంగా ఉన్న అసంఖ్యాకమైన పదాల నుండి తగిన పదాలను ఎంపిక చేసుకోవడం ద్వారా మాట్లాడటం అనే ప్రక్రియ రూపొందుతుంది. అలా రూపొందిన ఈ చర్య మెదడు నాడీ వ్యవస్థచే పంపించే సందేశాలద్వారా స్వర పేటికకు చేరవేయబడతాయి. ఈ ప్రక్రియ వెనుక కండరాల మరియు నాడీ తంత్రుల సమన్వయం ప్రధానమైన పాత్రను పోషిస్తుంది. మాట్లాడటానికి, మానసిక పరిస్థితికి దగ్గరి సంబంధం ఉంది. దీని మూలంగానే కోపంగా ఉన్నప్పుడు, భయం కల్గినప్పుడు, ఉద్రిక్తంగా ఉన్నప్పుడు ఆ ప్రభావం మాట్లాడే ప్రక్రియపై పడుతుంది. కొంతమందిలో ఈ ప్రభావం స్థాయి మరింత ఎక్కువగా ఏర్పడడంచేత, బాల్యదశలో భయాందోళనలకు గురికావడం చేత నత్తి పరిణమిస్తుంది. నత్తి జబ్బు కాదు. అలాగే నత్తి వంశ పారంపర్యంగా వచ్చేది కాదు. నత్తిగా మాట్లాడే కుటుంబంలో పెద్దలను అనుకరించడంచేతనే పిల్లలు కూడా నత్తితో మాట్లాడడం అలవర్చుకుంటారు. నత్తి కారణంగా ఇతరులతో కలవడానికి అయిష్టత ఏర్పడుతుంది. ఆత్మన్యూనత పెరుగుతుంది. నత్తిని పూర్తిగా నయం చేయవచ్చు. మీ విషయంలో నత్తి స్థాయి ఏమిటో గుర్తిస్తే గానీ తగిన నివారణా పద్ధతులను సూచించడం సాధ్యం కాదు. మీరు ఏవేని కొన్ని పదాలను ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎట్టి పరిస్థితులలోనైనా మాట్లాడలేక పోతున్నట్లయితే సైకోథెరపీ ద్వారా నయంచేయవలసి వుంటుంది. అలా కాక ఆయా అక్షరాలను పదాల మధ్య వచ్చినప్పుడు పలకలేని ఇబ్బంది ఉన్నట్లయితే హిప్నోథెరపీ ద్వారా నయం చేయవచ్చు. మీరు దగ్గర్లో ఉన్న కౌన్సిలింగ్ సైకాలజిస్టునుగానీ, సైకో థెరపిస్టునుగానీ, హిప్నోథెరపిస్టును గాని కలవండి.

మాది పేద కుటుంబం. మేము ముగ్గురం ఆడపిల్లలం. మా నాన్న తరపున చుట్టాలు, మేం పేదవాళ్ళమని వెలేసినట్లు చూస్తారు. ఆ బాధతో పట్టుదలగా చదువుకుని బాగా అభివృద్ధిలోకి రావాలని కోరుకుంటున్నాం. డిగ్రీలు పూర్తయిన తరువాత యం.బి.ఎ. వంటి కోర్సులను చేసి బాగా డబ్బులు సంపాదించాలని మా ఆలోచన. కానీ మా ఆలనాపాలనా చూసే మేనమామలు డిగ్రీ పూర్తయిన తర్వాత బియ్యీడీ చదవమని అంటున్నారు. ఈ రోజులలో టీచర్ ఉద్యోగంలో పెద్దగా సంపాదించేది ఏముంటుంది చెప్పండి. కాబట్టి ఇంకా మంచి కోర్సులు చదవాలని మా ఆకాంక్ష. మా మావయ్యలు మాత్రం పరిగెత్తి పాలు తాగవద్దని అంటున్నారు. మా ఆలోచన సరియైనదేనా?

పద్మావతి, శ్రీకాకుళం

ఉన్నతమైన లక్ష్యాలను కలిగిఉండటం మంచిదే. అయితే వాటిని సాధించే క్రమంలో స్వావలంబన చాలా ముఖ్యం. మీ ఆర్థిక పరిస్థితుల రీత్యా మీరు మీ మేనమామల సంరక్షణలో ఉన్నారు. వాళ్ళు చెపుతున్నట్లు టీచర్ కోర్సు మంచిదే. మీరనుకున్నంత స్థాయిలో కాకపోయినా సాధారణంగా, ప్రస్తుతం టీచర్లు కూడా బాగానే సంపాదిస్తున్నారు. అలాగే మీరనుకుంటున్నట్లు వృత్తి విద్య కోర్సు చేసినంత మాత్రాన దండిగా డబ్బు సంపాదించే వుద్యోగాలు వస్తాయని గ్యారంటీ ఏమీ లేదు. జీవితంలో ఎదగడం అన్నది ఒక స్వతంత్ర ఆలోచనగా వుండాలి. మీ తరపు బంధువులెవరో మిమ్మల్ని న్యూనత పరిచారని మీరు గొప్పవారు కావాలనుకోవడం సరికాదు. ఎవరో ఏదో అనుకుంటున్నారని మనం మరేదో భావించడం ఫాల్స్ ప్రిస్టేజ్. ఎవరికోసమో లేదా ఏదో ఒక వత్తిడి కారణంగానో ఆశయాలు పెట్టుకుంటే డిప్రెషన్‌కు దారి తీసే ప్రమాదం ఉంది. మీ లక్ష్యాన్ని చంపుకోకుండా ప్రస్తుతం మీ కాళ్ల మీద నిలబడటానికి చూడండి. ఇతరులపై ఆధారపడకుండా స్వయం సామర్థ్యాన్ని సంపాదించుకోగల్గితే మీరెన్ని ఉన్నత ఆశయాలు పెట్టుకున్నా వాటిని సాధించగల్గుతారు. అలా కాక ఇప్పుడే మీ తొందరపాటుతనం వల్ల మీ పెద్దలను వ్యతిరేకిస్తే మీ పరిస్థితి నడి సముద్రంలో నావలా మారిపోతుంది. అందుచేత అప్రమత్తంగా వ్యవహరించండి.

సమస్యలకు ఆహ్వానం

మీకు లేదా మీవాళ్ళకు మానసికమైన సమస్యలేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. సైకాలజిస్ట్ **శ్రీ హిప్నోకమలాకర్** తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, స్ట్రీట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

పిండకణ పరిశోధనపై వేటు మానవాళి అభ్యున్నతికి చేటు

ఎస్. వెంకట్రావు

మానవపిండానికి సంబంధించిన 'స్టెమ్ సెల్స్'పై విస్తృత పరిశోధనలకోసం మరిన్ని నిధులు కేటాయించాలని అమెరికా పార్లమెంటు (కాంగ్రెస్) చేసిన చట్టాన్ని అధ్యక్షుడు జార్జి బుష్ ఇటీవల వీటో చేశాడు. బుష్ తన ఆరేళ్ల పాలనాకాలంలో వీటో అధికారాన్ని వినియోగించుకోవడం ఇదే మొదటిసారి. అందునా మానవాళి అభ్యున్నతికి ఉపయోగపడే ఒక మంచి చట్టాన్ని అధ్యక్షుడు వీటో చేయడంపట్ల అమెరికాలోనూ, ప్రపంచమంతటానూ పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమౌతోంది. అమెరికా సమాజంలో అనేక విధాల మూఢవిశ్వాసాలను పెంచి పోషిస్తున్న ప్రస్తుత అధ్యక్షుడు మానవ పిండకణాల పరిశోధనపై వేటు వేయడంద్వారా మూఢవిశ్వాసాలకు ఊతమివ్వడమేగాక ప్రపంచ మానవాళికి తీరని అన్యాయం చేశారని చాలామంది పరిశీలకులు విమర్శిస్తున్నారు. ఈ వివాదం మొత్తాన్ని అర్థం చేసుకోవాలంటే మానవపిండాలకు సంబంధించిన 'స్టెమ్ సెల్స్' గురించీ, వాటిపై జరుగుతున్న పరిశోధనలగురించి, వాటి ఉపయోగాలగురించి అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

మానవ శరీరం, ఆ మాటకొస్తే అన్నిరకాల బహుకణ జీవుల శరీరాలూ కణాలతో నిర్మితమై ఉంటాయి. కణాలు (సెల్స్) అనేక రకాలుంటాయి. ఉదాహరణకు నాడీకణాలు, చర్మకణాలు, కండరకణాలు... ఇలా. ఒకేరకమైన కణాల సముదాయాన్ని కణజాలం అంటారు. మానవ జీవిత చక్రం ఏక కణజీవిగా ప్రారంభమౌతుంది. తండ్రి వీర్యకణం, తల్లి అండం కలిసి సంయుక్త కణంగా ఏర్పడుతుంది. ఈ ఏకకణం విభజన చెందడం ప్రారంభించి క్రమంగా బహుకణాలు కలిగిన పిండంగా మారుతుంది. ఈ పిండంలోని కణాలు తొలుత ఎటువంటి ప్రత్యేకతలూ లేని ఏకసదృశ కణాలుగా ఉంటాయి. తర్వాత అవి చర్మకణాలుగానూ, నాడీకణాలుగానూ, గుండె కణాలుగానూ... ప్రత్యేకతలు సంతరించుకుంటాయి. ఆ కణాలనే కణజాలాలు (టిష్యూస్) అంటారు. ప్రత్యేకత సంతరించుకోక ముందున్న కణాలను 'స్టెమ్ సెల్స్' అంటారు. అంటే ఎటువంటి ప్రత్యేకతలూ సంతరించు కోకుండా తమంత తాము కొత్త కణాలుగా విభజనచెందుతూ సంఖ్యరీత్యా అభివృద్ధిచెందే కణాలనే 'స్టెమ్ సెల్స్' అంటారు. పిండాల్లో ఉండే స్టెమ్ సెల్స్‌ను 'పిండ స్టెమ్ సెల్స్' అంటారు. అలా కాకుండా కొన్నిసార్లు జీవుల ఇతర అంగాల్లో కూడా ఇటువంటి స్టెమ్ సెల్స్ ఉంటాయి. ఉదాహరణకు ఎముకల గుజ్జులో పెద్ద ఎత్తున 'స్టెమ్ సెల్స్' ఉంటాయి. వీటిని 'ఎదిగిన (ఎడల్ట్) స్టెమ్ సెల్స్' అంటారు.

'స్టెమ్ సెల్స్' మీద ప్రస్తుతం ప్రపంచవ్యాపితంగా జరుగుతున్న ప్రయోగాల్లో మానవాళి భావి జీవిత సరళినే మార్చేయగల గొప్ప ఆవిష్కరణలు జరుగుతున్నాయి. నిజానికి 20 ఏళ్ల క్రితం వరకు 'స్టెమ్ సెల్స్' గురించి శాస్త్రవేత్తలకు పెద్దగా తెలీదు. ఎలుకపిండాలపై అనేక సంవత్సరాలు పరిశోధనలు జరిపాక 1998లో తొలిసారిగా మానవ పిండాల్లోని 'స్టెమ్ సెల్స్'ను వేరుచేసి పరిశోధనాశాలల్లోని గాజుపాత్రల్లో ఆ కణాలను పెంచడం ఎలాగో నేర్చుకున్నారు. అప్పటినుండే వివాదం కూడా ప్రారంభమైంది. మానవ పిండాలపై పరిశోధనలు చేయడం అంటే పిండాలను చంపడమే, అంటే మానవులను హత్య చేయడమేనని క్రైస్తవ చర్చికి సంబంధించిన వర్గాలు అభ్యంతరాలు లేవనెత్తాయి. దీనికి వంతపాడేవారు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. కాని శాస్త్రవేత్తలు మానవ పిండాలను తల్లి గర్భంనుండి తీసి పరిశోధనల్లో ఎన్నడూ ఉపయోగించరు. దీనికో పద్ధతుంది. గర్భాశయం బయట ఫలదీకరణద్వారా శిశుజనన ప్రక్రియ (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) 1973లో ప్రారంభమైన సంగతి మనకు తెలుసు. దీన్నే టెస్ట్ ట్యూబ్ బేబీల జననం అంటున్నాం. ఇప్పుడు సంతానం లేనివారికి ఈ ప్రక్రియద్వారా సంతానాన్ని అందజేసేందుకు వందలు, వేల సంఖ్యలో ఆసుపత్రులు ప్రారంభమవుతున్నాయి. టెస్ట్ ట్యూబ్‌లో ఫలదీకరణ జరిగిన తర్వాత సంయుక్త కణాన్ని తల్లి గర్భాశయంలో పెడతారు. అక్కడది పెరిగి పిండంగా, దాన్నుండి బిడ్డగా ఎదుగుతుంది. అయితే డాక్టర్లు తల్లి గర్భంలో ఒకటికన్నా ఎక్కువ సంయుక్త కణాలను పెడతారు. నాలుగైదు రోజుల పిండాలుగా మారిన తరువాత ఏదో ఒక పిండాన్ని ఉంచి మిగిలినవాటిని తొలగిస్తారు. ఈ తొలగించిన పిండాలనే శాస్త్రవేత్తలు పరిశోధనాశాలల్లో 'స్టెమ్ సెల్ పరిశోధన' కోసం ఉపయోగిస్తారు. ఈ స్టెమ్ సెల్స్ ఎలాగూ నాశనమైపోయేవే. వాటిని పరిశోధనకు ఉపయోగిస్తే తప్పేమీ లేదనేది పరిశోధకుల వాదన.

నిజానికి 2001లో జార్జి బుష్ అధికారంలోకి వచ్చిన కొత్తలోనే పరిమిత స్థాయిలో 'మానవ పిండ స్టెమ్ సెల్ పరిశోధన' కోసం నిధుల కేటాయింపు ఆదేశంపై సంతకాలు చేశాడు. అప్పటినుండి అమెరికాలోనూ, యూరప్‌లోనూ ఈ రంగంలో జరుగుతున్న పరిశోధనలు చాలా మంచి ఆవిష్కరణలకూ, కొత్త విషయాలు కనుగొనడానికీ తోడ్పడ్డాయి. ముఖ్యంగా వృద్ధుల్లో పెద్ద ఎత్తున వచ్చే అల్జిమీర్స్ వంటి వ్యాధులు (నాడులు క్షీణించి మనిషి కదల్లేకుండా ఉండిపోయే వ్యాధి- రొనాల్డ్ రీగన్‌కు వచ్చింది) నయం చేయడానికి, ఇంకా భవిష్యత్తులో గుండె జబ్బులు, మధుమేహ వ్యాధులు వంటి వాటిని నివారించడానికీ ఈ పరిశోధనలు తోడ్పడతాయంటున్నారు. నిజానికి ఇప్పుడిప్పుడే ప్రారంభమైన ఈ పరిశోధనలు గనుక అభివృద్ధి చెందితే మానవునికి వచ్చే అనేక రకాల భయంకర వ్యాధులను స్టెమ్ సెల్ థెరపీద్వారా నివారించవచ్చునని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సరిగ్గా ఇదే సమయంలో జార్జి బుష్ వీటో వల్ల ఈ పరిశోధనలకు పెద్ద ఎదురుదెబ్బ తగిలినట్లయింది. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కన్సర్వేటివ్‌ల ఓట్లకోసమే బుష్ ఈ రకమైన అభివృద్ధి నిరోధక చర్య తీసుకున్నాడని పరిశీలకులు అంటున్నారు. నిజానికి బుష్ అధికారంలోకి వచ్చాక విజ్ఞానశాస్త్రాన్ని నాశనంచేసే అనేక చర్యలు తీసుకున్నాడు. పరిణామవాదంతోబాటు పాఠశాలల్లో మూఢత్వంతో కూడిన 'సృష్టి వాదం' (క్రియేషనిజం)ను పిల్లలకు బోధించాలని ఆదేశించాడు. అమెరికా ప్రజల్లో క్రైస్తవ మత ఛాందసాన్నీ, ఇస్లాం వ్యతిరేకతనూ రెచ్చగొట్టాడు. గర్భస్రావ నిరోధక చట్టాలకు పదును పెట్టాడు. మరోవైపు విజ్ఞానశాస్త్రాన్ని యుద్ధాలకోసం, మానవ మారణహోమంకోసం ఉపయోగించడాన్ని పెంచాడు.

చూడబోతే సైన్సును రక్షించుకోడానికి పెద్ద ఉద్యమమే చేయాల్సి వచ్చేట్లుంది!

❑

కొత్త పుస్తకాలు

(అమ్మను జూడాలె... కథల సంపుటి, రచయిత: ఉదయమిత్ర, పేజీలు: 101, వెల: 40/-, ప్రతులకు: రచయిత, 9-25, ఓల్డ్ బజార్, జడ్చర్ల, మహబూబ్‌నగర్)

కర్కశ సమాజపు అమానుష కోణాలు

"**నా**యనా! గీ బునాది గట్టిది. నా బిడ్డలు మంచోల్లు. ఎవరికీ సెరుపు జేయనోల్లు. ఎవరికీ తలవొంచనోల్లు. నా ఒడిల ఉన్నప్పుడు ఏం సుఖం జూసింద్రోగానీ, కాల్లొచ్చినంక ఆల్ల బతుకు కారడివే... కాయలు దెచ్చింద్రు, కట్టెలు గొట్టింద్రు... బావులు దొవ్వింద్రు.... బంజర్లు దున్నింద్రు... గిది మా 'దొర'కు నచ్చలేదు...

నా బిడ్డలు నాయెం కోసం నిలబడ్డరు. నాయెం కోసం తెగబడ్డరు. మట్టి బిసికి మాణిక్యాలు బోసింద్రుగాని, దొర కాల్లు బిసికి దాసులుగాలె... రాత్రి పగలు పొలం దిక్కే జూసింద్రుగాని, దొర జరిపే 'పంచాయతి'ల దిక్కు జూల్లె... గిది మా 'దొర'కు కంపరమెత్తించింది."

'అమ్మను జూడాలె'లో 'బానిసల రాజ్యం' కథా భాగమిది. చక్కటి మాండలిక సొంపుతో కథ ఆసక్తిగా చదివిస్తుంది. దొర పెత్తందారీతనాన్ని ఓ వృద్ధురాలిచేత ఆక్రోశంగా చెప్పిస్తాడు రచయిత.

పెత్తందారీతనం, పాలమూరు జిల్లాలో దుర్భర కరువుతో వలస వెళ్ళే జీవితాలు, ఆదిలాబాద్ జిల్లాలోని అటవీ ప్రాంతాల ప్రజల కష్టాలు... తదితర అంశాలు ఇందులో ప్రధాన ఇతివృత్తాలు.

ఈ సంపుటిలో 17 కథలున్నాయి. 'భయం' కథలో ఆవు కొండమీద పులి ఉంటుందని తెలిసి కూడా అక్కడ సమృద్ధిగా ఉన్న పచ్చికను తినాలని వెళ్ళి ఆ ప్రయత్నంలో చనిపోతుంది. అయితే ఆవు పులిని ఎదుర్కొన్న తీరు మిగతా ఆవులలో భయం పోగొట్టి ఆవులన్నీ కలిసి ఉంటే పులిపై విజయం సాధించవచ్చనే విశ్వాసాన్ని కల్గిస్తుంది. పెత్తనం చేస్తున్న గుప్పెడు ఆధిపత్య వర్గంపై మెజారిటీ ప్రజలు ఉమ్మడిగా ఉద్యమిస్తే విజయం పొందవచ్చు అనే అంశాన్ని ఈ కథలో సింబాలిక్‌గా చెప్తాడు రచయిత. ఇటువంటిదే కొండచిలువ కథ. ఇది సామ్రాజ్యవాదపు దుష్టత్వాన్ని చెప్పిన కథ. అమెరికా సామ్రాజ్యవాదపు పాత్రలో ఉన్న కొండచిలువ ఆయా దేశాల రాజకీయ నాయకులకు బహుమతులు ఇచ్చి వాళ్ళకు కొండచిలువ విధానాలపట్ల భ్రమలు కల్పించి పూర్తిగా పెత్తనం సాధించిన తరువాత మెల్లగా ఒక్కో జీవినీ కబళించడం ప్రారంభిస్తుంది. కథనం ప్రతిభావంతంగా ఉండి సామ్రాజ్యవాదాన్ని చిత్రించిన తీరు పాఠకుణ్ణి విస్మయపరుస్తుంది.

'భయం', 'సాచ్చీకం' కథలు రెండూ ఇంచుమించు ఒకే రకమైన కథాంశాలతో ఒకేలా ఉంటాయి. కథనం మాత్రమే వాటిని వేరుచేస్తుంది. చెప్పాల్సిన మరో కథ సంపుటి పేరయిన 'అమ్మను జూడాలె'. కొడుకును వేరే ఊరి హోటల్లో జీతానికి ఉంచి తను మరో వూరు కూలీకోసం వలస వెళ్తుంది తల్లి. పసివాడైన కొడుకు హోటల్ యజమాని హింసను తట్టుకోలేక అమ్మను చూడాలని హోటల్ నుండి తప్పించుకుని పారిపోయి తన ఊరు వస్తాడు. బస్సు దిగిన దగ్గర్నుంచి గ్రామస్తులంతా విస్మయంగా, సానుభూతిగా చూస్తుండగా ఇంటికి వెళ్తే అక్కడ ఇంటిముందు గుమిగూడిన జనంమధ్య తల్లి శవమై కనపడుతుంది. హృదయాలను కదిలించే కథనంతో సాగిన ఈ కథ పాఠకుడిని వేదనకు గురిచేస్తుంది.

కథలన్నీ రచయిత సామాజిక దృక్పథాన్ని అవగతం చేస్తాయి. 'గ్యాస్‌లైట్' అనే కథలో ఒక చిన్న గూడెంలో ప్రభుత్వం దిగువ ప్రాంతంవారికి, ఎగువ ప్రాంతంవారికీ రెండు గ్యాస్‌లైట్లు ఏర్పాటు చేసింది. దిగువ ఉన్న వారి గ్యాస్‌లైట్ పాడైపోయి మూలన పడేస్తారు. ఒకరోజు దిగువ ప్రాంతానికి చెందిన జంగుబాయి ప్రసవంతో బాధపడుతుంటుంది. ప్రసవం జరిగేలా ఉందని, లైటు లేకపోతే కష్టమని సహాయంగా ఉన్న తోటి మహిళలు భావిస్తారు. జంగుబాయి భర్తను ఎగువ ప్రాంతానికెళ్ళి వాళ్ళ గ్యాస్‌లైటు తీసుకురమ్మని పంపిస్తారు. తాగుబోతైన జంగుబాయి భర్త తూలుకుంటూ ఎగువ ప్రాంతం వెళ్ళి ఆ గ్యాస్‌లైట్ వెలుగులో దావత్ చేసుకుంటోన్న మోతుబరి పోచయ్యను అడిగి లేదనిపించుకుని వస్తాడు. ఆగ్రహించిన మహిళలు దండుగా వెళ్ళి మోతుబరిని కొట్టి గ్యాస్‌లైట్‌ను లాక్కొస్తారు. నెలకొన్న పరిస్థితులలో ఎలాంటివారైనా చైతన్యవంతంగా ప్రవర్తిస్తారని రచయిత అంతర్లీనంగా వ్యక్తీకరిస్తాడు.

'అమ్మా నన్ను తీస్కపో' కథ కొంత వివాదాస్పద నేపథ్యంతో సాగుతుంది. టీనేజ్‌లో ఉన్న బాలిక ఒక పెత్తందారింటిలో పనిమనిషిగా ఉంటూ ఎదుర్కొన్న హింస, లైంగిక వేధింపులతో పాటు అతని క్రూర మనస్తత్వం ఇందులో ప్రధానాంశం. కథలో అవసరం లేకపోయినప్పటికీ దుర్మార్గంగా ప్రవర్తించే పెత్తందారుడు ఆంధ్రప్రాంతంవాడని ముద్రవేయడం, వాళ్ళంతా అలాగే దోపిడీ చేస్తారని పనిపిల్ల పాత్రతో చెప్పించడం రచయిత సంకుచిత దృక్పథాన్ని తెలియజేస్తుంది. సామాజిక సమస్యలపట్ల తీవ్రంగా స్పందించే గుణం ఉన్న రచయిత సమస్యను తప్పుదారి పట్టించే విషయాలపట్ల ఈ విధమైన అవగాహన కలిగి ఉండడం కొంత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

సీరియస్‌గా స్పందించిన రచయిత తనదైన రాజకీయ దృక్పథాన్ని దృష్టిలో పెట్టుకుని కథలు రాసిన తీరును పాఠకుడు గ్రహిస్తాడు. కనీస ప్రజాస్వామిక పాలనపట్ల ఏ మాత్రం సానుభూతి ఈ కథల్లో కనపడదు. ప్రజాస్వామ్యమనే ముసుగులో పెత్తందారులు చేస్తున్న అరాచకాలను నిరసిస్తూ సాగిన ఈ కథలు వ్యవస్థమీద పాఠకుల కోపాన్ని మరింత పెంచుతాయి. అయితే రచయిత మరింత విశాల దృక్పథంతో తన రచనలు చేస్తే విశాల ప్రజానీకంమధ్య సామరస్యధోరణి ఏర్పడడానికి, తద్వారా రచయిత ఆశించిన సామాజిక మార్పు త్వరగా రావడానికి అవకాశం ఉంటుంది. సామాజిక మార్పును కాంక్షిస్తూ నిబద్ధతతో రాసిన ఈ కథలు అందరూ చదవాల్సినవి.

- వీరప్రసాద్



తరువోజ

పద్య సంకలనం

వెల:150/-.

పేజీలు:157

ప్రతులకు :

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

అన్ని బ్రాంచీలలో..



పొద్దు పూసింది

అశోక్ కుమార్

వెల:20/-, పేజీలు:63

ప్రతులకు :

సింగంపల్లి అశోక్ కుమార్

305, ప్రగతి టవర్స్,

వీరయ్య స్ట్రీట్,

మారుతి నగర్, విజయవాడ.



రుచి

నువ్వుల పొడి అన్నం

కావలసిన పదార్థాలు

బియ్యం	:	రెండు కప్పులు
నువ్వులపొడి	:	ఒక కప్పు
ఎండు మిర్చి	:	ఎనిమిది
ఆవాలు	:	ఒక స్పూన్
మినప్పప్పు	:	ఒక స్పూన్
ఉప్పు	:	తగినంత
పసుపు	:	చిటికెడు
కరివేపాకు	:	రెండు రెబ్బలు
నూనె	:	తగినంత

తయారుచేసే పద్ధతి

అన్నం పొడిపొడిగా వండుకుని ఒక బేసిన్‌లో చల్లార్చుకోవాలి. నువ్వులను మూకుట్లో పోసి దోరగా వేయించి చల్లార్చి పొడిచేసి ఇందాకటి అన్నంలో వేసి, ఉప్పు కూడా వేసి బాగా కలపాలి. తర్వాత మూకుట్లో నూనె వేసి వేడి చేసి పైనచెప్పిన పోపు సామాను వేసి ఎండుమిర్చి, కరివేపాకు కూడావేసి దించి నువ్వుపొడి కలిపిన అన్నంలో వేసుకుని బాగా కలపాలి.

క్యారెట్ స్వీట్ పరోటా

కావలసిన పదార్థాలు

పంచదార	:	ఒక కప్పు
క్యారెట్ తురుము	:	రెండు కప్పులు
యాలకుపొడి	:	అరస్పూన్
పాలు	:	ఒక కప్పు
మైదా	:	రెండు కప్పులు
నూనె	:	తగినంత
నెయ్యి	:	అరకప్పు

తయారుచేసే పద్ధతి

మైదాపిండిని ఓ గిన్నెలోకి తీసుకుని నీరుపోసి చపాతీపిండిలా కలిపి మూతపెట్టి పక్కనుంచాలి. బాణలిలో నెయ్యివేసి కాగాక అందులో క్యారెట్ తురుము వేసి వేయించి పాలు, పంచదార వేసి బాగా దగ్గరగా అయ్యేవరకూ కలియబెడుతూ ఉండాలి. ముద్దగా అయ్యాక యాలకుల పొడివేసి దించి, చల్లారాక చిన్నచిన్న ముద్దలుగా చేసుకోవాలి. ఇందాక కలిపి వుంచుకున్న మైదాపిండిని, పూరీల్లా చేసుకుని దీనిలో క్యారెట్ ముద్దను పెట్టి పైన ఇంకో పూరీతో మూసేసి, పెనంపై నూనెవేసి వాటిని రెండువైపులా దోరగా కాల్చాలి. ఇవి చాలా రుచిగా వుంటాయి.

– జ్యోతి

కలంస్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలంస్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్:

కలం స్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : నరాలశెట్టి శ్రీను
వయసు : 9 సం॥
చదువు : 4వ తరగతి
స్కూలు: ఎలిమెంట్రీ స్కూల్
హాబీలు: క్రికెట్ ఆడడం, పేపర్ చదవడం, చిరంజీవి సినిమాలు చూడడం.
లక్ష్యం: ఎవర్నీ బాధపెట్టకుండా మంచిగా ఉండడం.
చిరునామా : ఎన్.శ్రీను, సన్నాఫ్ సత్యనారాయణ, బొబ్బర్లంక, ఆత్రేయపురం (మం), తూ.గో జిల్లా.

పేరు : మాధగిరి నవీన
వయసు : 12 సం॥
చదువు : 7వ తరగతి
స్కూలు: జడ్.పి.ఎస్.ఎస్. హైస్కూల్
హాబీలు: పుస్తకాలు చదవడం, ముగ్గులు వేయడం.
చిరునామా : మాధగిరి నవీన, డాటరాఫ్ నాగేంద్రబాబు, వెంకటాపురం (పోస్ట్ & మం), ఖమ్మం జిల్లా. 507 136.

పేరు : పి.శ్రీహర్ష
వయసు : 12 సం॥
చదువు : 7వ తరగతి
స్కూలు: సిద్ధార్థ హైస్కూల్
లక్ష్యం: శాస్త్రవేత్త అవడం
హాబీలు: ప్రజాశక్తి వీక్లీ చదవడం, చిత్రలేఖనం, పిల్లలతో సరదాగా ఆడుకోవడం.
చిరునామా : పి.శ్రీహర్ష, డాటరాఫ్ అంకిరెడ్డి, డోర్ నం: MIG-8, టి.వి కాలనీ, వనస్థలిపురం, హైదరాబాద్.

పేరు : వాంకుడోతు నవీన్ నాయక్
వయసు : 11 సం॥
చదువు : 6వ తరగతి
స్కూలు: శ్రీ చంద్ర మెమోరియల్ హైస్కూల్
లక్ష్యం: డాక్టర్ అవడం
హాబీలు: పుస్తకాలు చదవడం, టీవీ చూడడం, చెస్, క్రికెట్ ఆడడం, ఈత కొట్టడం.
చిరునామా : వి.నవీన్‌నాయక్, సన్నాఫ్ బుచ్చన్న, విశ్వనాథపురం, గీసుగొండ (మం), వరంగల్ జిల్లా.

పేరు : యు.శేషుకుమార్
వయసు : 12 సం॥
చదువు : 7వ తరగతి
స్కూలు: లీలా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్
హాబీలు: షెటిల్, క్రికెట్ ఆడడం.
చిరునామా : యు.శేషుకుమార్, సన్నాఫ్ శ్రీనివాసులు, డోర్ నం: XIV-250, కెప్టెన్ లక్ష్మీ వీధి, మదనపల్లి, చిత్తూరు జిల్లా. 517 325.

పేరు : చింతల వంశీవర్ధన్ రెడ్డి,
వయసు : 8 సం॥
చదువు : 3వ తరగతి
స్కూలు: అన్న మెమోరియల్ స్కూల్
హాబీలు: టీవీ చూడడం, ఆటలు ఆడడం.
చిరునామా : సిహెచ్ వంశీవర్ధన్‌రెడ్డి, సన్నాఫ్ దామోదర్‌రెడ్డి, చౌటుప్పల్, నల్గొండ జిల్లా. 508 252.